


# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY




SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 234 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ శనివారం 16 మే 2026 పేజీలు : 12 వెల : 2/-



# ఏపీ అంటే 'అడ్వాన్స్‌డ్ ప్రదేశ్'

- చంద్రబాబు ఆలోచనలు మామూలుగా ఉండవు : కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్
- ఇకపై పుట్టపర్తి భక్తికే కాదు.. దేశ భద్రతకు కూడా కేరాఫ్ అడ్రస్: సీఎం చంద్రబాబు
- పుట్టపర్తిలో వేల కోట్ల విలువైన భారీ రక్షణ ప్రాజెక్టులకు శంకుస్థాపన
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వం, విజన్‌పై రాజ్ నాథ్ సింగ్ ప్రశంసల వర్షం
- ఏపీని దేశానికే రక్షణ హబ్‌గా మార్చే ప్రణాళికలో భాగంగా కీలక అడుగులు

**విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌ను దేశ రక్షణ రంగ పటంలో అగ్రస్థానంలో నిలుపుతూ, రాష్ట్ర చరిత్రలోనే ఒక చారిత్రక అధ్యాయానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అనంతపురం జిల్లా పుట్టపర్తి వేదికగా శుక్రవారం వేల కోట్ల రూపాయల విలువైన నాలుగు కీలక రక్షణ రంగ ప్రాజెక్టులకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, ఏపీ సీఎం చంద్రబాబుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం కేవలం ఆంధ్రప్రదేశ్‌కే కాకుండా, యావత్ భారత రక్షణ రంగ స్వావలంబన ప్రయాణంలో ఒక మైలు రాయిగా నిలుస్తుందని ఆయన అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, మిగతా .. 2లో..

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి

## కాటన్ దొరే స్ఫూర్తి

సీఎం చంద్రబాబు

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసి, అన్నదాతకు శాశ్వత సంపదను అందించిన మహనీయులు సర్ ఆర్థర్ కాటన్ అని, ఆయన జయంతి సందర్భంగా స్మరించుకుంటున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కాటన్ తన దూరదృష్టితో మిగతా .. 2లో..

## మోదీ విమానానికి ఎస్కార్ట్..

ఫైటర్ జెట్‌తో యూఏఈ ప్రత్యేక స్వాగతం



**విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రధాని నరేంద్రమోదీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనకు అరుదైన గౌరవం లభించింది. మోదీని యూఏఈ ప్రత్యేకంగా స్వాగతించింది. ఆయన ప్రయాణిస్తున్న విమానం శుక్రవారం మధ్యాహ్నం యూఏఈ గగతనలంలోకి ప్రవేశించగానే.. ఆ దేశ ఫైటర్ జెట్ ఎస్కార్ట్‌గా వచ్చింది. తమ వాయుసేన కోసం ప్రత్యేకంగా రూపొందించిన యుద్ధ విమానం ఎఫ్-16 బ్లాక్ 60 'డెజర్ట్ ఫాల్కన్'ను పంపింది. అబుదాబిలో ప్రధాని విమానం ల్యాండ్ అయ్యేవరకు వెంటే వచ్చింది. ఐరోపా దేశాల పర్యటనకు బయల్దేరిన మోదీ మధ్యలో యూఏఈకి వెళ్లారు. కేవలం కొన్ని గంటలే అక్కడ ఉండనున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో అంతర్జాతీయంగా ఇంధన సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో ఆయన పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

**యూఏఈపై ఇరాన్ దాడి సరికాదు: మోదీ**

యూఏఈపై ఇరాన్ దాడిని ప్రధాని మోదీ ఖండించారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం మిగతా .. 2లో..

నీట్ పేపర్ లీక్..

## కీలక సూత్రధారి అరెస్టు




**విశ్వం వాయిస్ న్యూస్ :** నీట్-యూజీ పేపర్ లీక్ కేసులో సీబీఐ దర్యాప్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా కెమిస్ట్రీ లెక్చరర్‌గా పనిచేస్తున్న పి.వి. కులకర్ణిని పుణెలో అరెస్టు చేసింది. ఈ వ్యవహారంలో ఇతడే సూత్రధారిగా కేంద్ర దర్యాప్తు సంస్థ భావిస్తోంది. నీట్ పరీక్ష నిర్వహణలో ఎన్‌టీఏలో భాగస్వామిగా ఉన్న ఆయనను సుదీర్ఘ సమయం విచారించిన సీబీఐ.. అనంతరం అరెస్టు చేసినట్లు ప్రకటించింది. లాతూర్‌కు చెందిన కెమిస్ట్రీ లెక్చరర్ కులకర్ణి సుదీర్ఘ కాలంగా నీట్ ప్రశ్నాపత్రాన్ని రూపొందించే నిపుణుల కమిటీలో ఉంటున్నాడు. అయితే, తనకు ఉన్న ప్రత్యేక అధికారాలను ఉపయోగించిన ఆయన.. మరో మిగతా .. 2లో..

## ఒంటరిగా వెళ్లి దెబ్బతిన్నాం.. ఏపీలో పరిస్థితులు వేరు..

జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్నో ఆటుపోట్లు తట్టుకుంటేనే పార్టీని నడపగలమని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. పక్క రాష్ట్రంలో ఒకరు పార్టీ పెట్టి సీఎం అయ్యారని, తాను కూడా అలా వెళ్తే బాగుండేదని అనేక మంది సలహాలు ఇస్తున్నారని.. కానీ ఏపీలో పరిస్థితులు వేరనే విషయాన్ని వాళ్లు తెలుసుకోవాలని వ్యాఖ్యానించారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో 'జనసేన ఉద్యమి ఆత్మీయ సమావేశం' నిర్వహించారు. ఈ సమావేశానికి పవన్ హాజరై మాట్లాడారు. ఒంటరిగా వెళ్లి దెబ్బతిన్నామని.. తాను కూడా రెండు చోట్లా ఓడిపోయానన్నారు. జనసేన పార్టీకి మూలస్తంభం కార్యకర్తలేనని చెప్పారు. కుటుంబం నడిపే పార్టీగా ఉండకూడదని కోరుకుంటున్నానని పేర్కొన్నారు.

**సైనస్ సమస్య.. కంటి చూపుపై ప్రభావం పడింది**

"సైనస్ సమస్యతో చాలా ఇబ్బంది పడ్డాను. కంటిచూపుపైనా అది ప్రభావం చూపింది. ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయిస్తే భుజం ఎముక సమస్య బయటపడింది. పర్యటనలకు వెళ్లినప్పుడు అభిమానుల తాకిడి కారణంగా ఆ సమస్య వచ్చింది. మార్షల్ ఆర్ట్స్‌లో ప్రవేశం ఉండటంతో నొప్పిని భరించగలిగాను. నా ఆరోగ్యం కోసం ప్రార్థించిన అందరికీ కృతజ్ఞతలు. కొందరు నాయకులు ఓటమిని చూడగానే వదిలేసి వెళ్లిపోయారు. జనసైనికులు, వీరమహిళలు మాత్రమే నా వెంట మొదటి నుంచి ఉన్నారు. సమావేశానికి కర్ణాటక నుంచి కూడా అభిమానులు రావటం సంతోషం. 2014లో నా ఒక్కడితోనే జనసేన ప్రారంభమైంది. ఇప్పుడు 21.50 లక్షల మంది పార్టీలో సభ్యులుగా ఉన్నారు. జనసేన సాధక్‌లు, కార్యకర్తలు కలిసి పార్టీ నిర్మాణాన్ని క్షేత్రస్థాయిలో పూర్తిచేశారు. మీ ఊరికి మీరే పవన్ కల్యాణ్‌లా మారి సమస్యల పరిష్కారం కోసం పనిచేయాలి. జనసేన 100 శాతం విజయం వెనుక జనసైనికులందరి ఉమ్మడి కృషి ఉంది. ఇతర రాష్ట్రాలకు వెళ్లినప్పుడు అక్కడి వారు జనసేన మద్దతు కోరుతున్నారు. ఏపీ, పొరుగు రాష్ట్రాల పరిస్థితులు వేరు. 2019లో నేను ఒంటరిగా పోటీచేస్తే రెండు చోట్లా ఓడించారు. అందుకే రెండింటినీ పోల్చి చూడొద్దు. పదవి కోసమే అనుకుంటే 2014లో కూటమి నుంచి మల్కాజిగిరి నుంచి ఎంపీగా పోటీ చేయాల్సింది. కాన్షీరాం వంటి వారు పదవుల కోసం రాజకీయాలు చేయలేదు.

**పైరవీలతో వచ్చి పదవులు కావాలంటే కుదరదు**

దాదాపు 20 ఏళ్లుగా రాజకీయాల్లో నలుగుతున్నాను. ప్రజల కోసం మాట్లాడితే.. ఇతర రాజకీయ పక్షాలు కూడా మనకు మిగతా .. 2లో..

త్వరలో కర్నూలుకు

## హైకోర్టు బెంచ్

మంత్రి నారా లోకేష్



**పుట్టపర్తి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్డీఏను గెలిపించినందుకు రుణం తీర్చుకుంటున్నామని మంత్రి నారా లోకేశ్ అన్నారు. పుట్టపర్తిలో 650 ఎకరాల్లో అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ ప్రాజెక్టు నిర్మాణానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. రూ.15,803 కోట్ల భారీ వ్యయంతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు ద్వారా ఐదో తరం యుద్ధ విమానాలను తయారు చేయనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి లోకేశ్ మాట్లాడారు. 'కరవు నేలపై కార్ల తయారీ పరిశ్రమలు తీసుకొచ్చిన మూడు అక్షరాల వ్యక్తి సీబీఎన్. ఫైటర్ జెట్లు తయారీ పరిశ్రమలు ఈ ప్రాంతానికి తెచ్చిన వ్యక్తి సీబీఎన్. ఒకప్పుడు పుట్టపర్తిలో కనీసం వంద ఇళ్లు కూడా లేవు. ఇప్పుడు ప్రపంచానికే అద్భుత ఆధ్యాత్మిక కేంద్రంగా పుట్టపర్తి మారింది. 1991లో సత్యసాయి బాబా ఎయిర్‌పోర్టు నిర్మిస్తుంటే చాలా మంది మిగతా .. 2లో..

వైసీపీ నేతలు

## రాక్షసులు

బైరెడ్డి శబరి



**విశ్వం వాయిస్ న్యూస్ :** కర్నూలులో నిన్న వైసీపీ నిర్వహించిన ఆందోళనల్లో పాల్గొన్న వారిలో సగం మందికి పైగా గంజాయి బ్యాచ్, క్రిమినల్ బ్యాక్ గ్రౌండ్ ఉన్నవారేనని బైరెడ్డి శబరి ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి కేవలం 'స్కామ్' మనుషులతో మాట్లాడిస్తున్నారని, చిల్లర ఇష్యూలను పట్టుకొని అలజడులు సృష్టించడం వైసీపీకి అలవాటుగా మారిందని మండిపడ్డారు. ముఖ్యంగా అమ్మాయిలను బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు దోచుకునే 'బాలు' వంటి వ్యక్తుల కోసం వైసీపీ నాయకులు రోడ్లపైకి రావడం సిగ్గుచేటని విమర్శించారు. ముచ్చుమర్రిలో మైనర్ బాలికపై జరిగిన అమానుష ఘటనను ప్రస్తావిస్తూ, ఆ దారుణానికి మిగతా .. 2లో..

## కాటన్ ఆశయాలతో ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి

లైడార్ సర్వే ఆధారంగా డెల్టా ప్రక్షాళనకు డిపిఆర్ సిద్ధం చేస్తున్నాం
ఈపడాది కాలువల్లో పూడికతీత పనుల కోసం 397 కోట్లు కేటాయింపు
సర్ ఆర్థర్ కాటన్ జయంతి వేడుకల్లో - మంత్రి నిమ్మల రామానాయుడు



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాటన్ మహాశయుని ఆశయాలతో రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామన్నారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శుక్రవారం విజయవాడ జలవనరుల మంత్రి క్యాంపు కార్యాలయంలో మిగతా .. 2లో..

కాకినాడలో సందడి చేసిన

## 'దూరదర్శిని కలిపింది ఇద్దరినీ' చిత్ర యూనిట్

సీనియర్ విలన్లను తలపించిన పరశురాం పాత్రలో విజయ్ కృష్ణారెడ్డి నటన
విలన్‌ను సత్కరించిన అభిమానులు, ప్రేక్షకులు

**కాకినాడ విశ్వం వాయిస్ న్యూస్ :** వైవిధ్య భరితమైన కథాంశంతో రూపొందిన 'దూరదర్శిని కలిపింది ఇద్దరినీ' చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చిన సందర్భంగా చిత్ర యూనిట్ శుక్రవారం కాకినాడలో సందడి చేసింది. ఈ సందర్భంగా చిత్ర బృందం మాట్లాడుతూ ఈ చిత్రంలో 'పరశురామ్' అనే మిగతా .. 2లో..



## పొదుపు చర్యల్లో భాగంగా ఈసారి హైబ్రిడ్ మోడ్‌లో మహానాడు



- ఈసారి హైబ్రిడ్ విధానంలో టీడీపీ మహానాడు
- ఆయిల్ సంక్షోభం, పొదుపు చర్యల కారణంగా నిర్ణయం
- మినీ, పార్లమెంటరీ స్థాయి మహానాడులు రద్దు
- మంగళగిరిలో ముఖ్య నేతలు, క్లస్టర్లలో కార్యకర్తలు
- 1848 కేంద్రాల్లో స్క్రీన్ల ద్వారా వీక్షించే ఏర్పాట్లు
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

**విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు దేశం పార్టీ ఏటా నిర్వహించే 'మహానాడు' పండుగను ఈసారి హైబ్రిడ్ విధానంలో నిర్వహించాలని ఆ పార్టీ నిర్ణయించింది. పశ్చిమాసియా యుద్ధం, దేశంలో నెలకొన్న చమురు మిగతా .. 2లో..

విదేశీ ప్రయాణంపై పన్ను అంటూ వార్తలు..

## తోసిపుచ్చిన మోదీ

**విశ్వం వాయిస్ న్యూస్ :** విదేశీ ప్రయాణాలపై పన్ను లేదా సర్వీస్ ఛార్జ్ విధించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు వచ్చిన వార్తలను ప్రధాని మోదీ ఖండించారు. అటువంటి కథనాల్లో ఎలాంటి నిజం లేదన్నారు. ఆంగ్ల మీడియాలో వచ్చిన ఓ కథనాన్ని ఉద్దేశిస్తూ ఈ మేరకు సోషల్ మీడియాలో ప్రధాని మోదీ పోస్టు చేశారు. సులభతర వాణిజ్యం, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు.

## అమెరికా ఆ ట్రాప్‌లో పడొద్దన్న చైనా

జిన్‌పింగ్ మాటకు అర్థమిదేనా..?



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తొమ్మిదేళ్ల తర్వాత చైనాలో పర్యటిస్తున్నారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక, వాణిజ్యం సహా పలు అంశాల్లో నెలకొన్న ఉద్రిక్తతలను పరిష్కరించుకునే దిశగా ఈ పర్యటన జరుగుతోంది. ఈ సందర్భంగా ట్రంప్‌నకు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఒక సలహా ఇచ్చారు. థుసిడైడ్స్ ట్రాప్‌ను అమెరికా అధిగమించాలని సూచించారు.

**అసలు ఆయన మాటల వెనక అర్థం ఏంటి..?**

థుసిడైడ్స్ ట్రాప్.. ఒక ఎదుగుతున్న దేశం, ఇప్పటికే అగ్రరాజ్యంగా కొనసాగుతున్న దేశాన్ని సవాలు చేసినప్పుడు రెండింటి మధ్య పలు విషయాల్లో మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి కాటన్ దొరే స్ఫూర్తి

గోదావరి డెల్టాకు జీవం పోసి లక్షలాది రైతు కుటుంబాలకు వెలుగునిచ్చారని గుర్తుచేశారు. అందుకే ప్రజల గుండెల్లో ఇప్పటికీ ఆయన సజీవంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి, సమర్థ నీటి నిర్వహణకు కాటన్ దొరనే స్ఫూర్తి అని చెబుతూ చంద్రబాబు నివాళులు అర్పించారు.

## ఏపీ అంటే 'అడ్వాన్స్‌డ్ ప్రదేశ్'

టీజీ భరత్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

**చంద్రబాబు విజన్‌పై ప్రశంసల జల్లు**

ఈ సందర్భంగా రాజ్ నాథ్ సింగ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత, పాలనా సామర్థ్యంపై ప్రశంసల వర్షం కురిపించారు. "నా సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎందరో నాయకులను చూశాను. కానీ, టెక్నాలజీ పట్ల చంద్రబాబుకు ఉన్న పట్టు, అభివృద్ధి పట్ల ఆయనకున్న నిబద్ధత, భవిష్యత్తును అంచనా వేయగల ఆయన దూరదృష్టి చాలా అరుదుగా కనిపిస్తుంది. ఆయన ఆలోచనలు ఎప్పుడూ చిన్నవిగా ఉండవు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషికి కేవలం భారత్‌లోనే కాకుండా అంతర్జాతీయ వేదికలపైనా ప్రశంసలు దక్కాయి" అని కొనియాడారు. గూగుల్ వంటి బహుళజాతి సంస్థ తన ఏఐ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి ఏపీని ఎంచుకోవడమే చంద్రబాబు సామర్థ్యానికి నిదర్శనమని అన్నారు. "చంద్రబాబు నాయకత్వంలో ఏపీ అంటే ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాదు, 'అడ్వాన్స్‌డ్ ప్రదేశ్'గా ఎదుగుతుందన్న పూర్తి విశ్వాసం నాకుంది" అని రాజ్ నాథ్ ధీమా వ్యక్తం చేశారు.

**వేల కోట్ల పెట్టుబడులతో కీలక ప్రాజెక్టులు**

పుట్టపర్తిలో ప్రారంభమైన ప్రాజెక్టుల వివరాలను రాజ్ నాథ్ సింగ్ వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు భారత సైన్యం, వాయుసేన, నౌకాదళం.. ఇలా త్రివిధ దళాల సామర్థ్యాన్ని బలోపేతం చేస్తాయని వివరించారు.

**1.అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ కేంద్రం:** ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో, రూ.15,000 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఐదో తరం యుద్ధ విమానం 'అమ్కా' ప్రాజెక్టులో భాగంగా రూ.2,000 కోట్లతో కోర్ ఇంటిగ్రేషన్, ఫ్లైట్ టెస్టింగ్ కేంద్రాన్ని పుట్టపర్తిలో ఏర్పాటు చేస్తున్నారు. ఇలాంటి అత్యాధునిక సదుపాయం ప్రపంచంలోనే అతి కొద్ది ప్రదేశాల్లో ఉందని, ఇకపై ఆ జాబితాలో పుట్టపర్తి పేరు చేరనుందని అన్నారు.

**2.భారత్ డైనమిక్స్ లిమిటెడ్ యూనిట్:** రూ.480 కోట్లతో బీడీఎల్ ఏర్పాటు చేయనున్న ఈ కేంద్రంలో అత్యాధునిక అండర్‌వాటర్ సిస్టమ్స్, అటానమస్ అండర్‌వాటర్ వెహికల్స్, నెక్స్ట్ జనరేషన్ టార్పెడోలు తయారు చేస్తారు. ఇది మన నౌకాదళ సామర్థ్యాన్ని, బ్లూ ఎకానమీని బలోపేతం చేస్తుంది.

**3.భారత్ ఫోర్జ్ (ఆగ్నేయ) యూనిట్:** భారత్ ఫోర్జ్ అనుబంధ సంస్థ అయిన ఆగ్నేయ ఎనర్జిటిక్స్, రూ.1,500 కోట్ల పెట్టుబడితో అధునాతన ఆయుధాల తయారీ కేంద్రాన్ని నెలకొల్పుతోంది.

**4. హెచ్ ఎఫ్ సీఎల్ ఫ్యూజ్ ప్లాంట్:** రూ.1,294 కోట్ల పెట్టుబడితో హిమాచల్ ఫ్యూచరిస్టిక్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ ఆర్టిలరీ షెల్స్, బాంబులకు అవసరమైన ఎలక్ట్రికల్ ఫ్యూజ్‌ల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది.

వీటితో పాటు, 8 డ్రోన్ కంపెనీలు కలిసి కర్నూలులో ఒక 'డ్రోన్ సిటీ'ని ఏర్పాటు చేస్తున్నాయని, భవిష్యత్తులో ఈ ప్రాంతం ప్రపంచ డ్రోన్ హబ్‌గా మారుతుందని రాజ్ నాథ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

**'ఆత్మనిర్భర్ భారత్' దిశగా పయనం**

గత పదేళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో రక్షణ రంగం స్వరూపం పూర్తిగా మారిపోయిందని రాజ్ నాథ్ అన్నారు. "2014లో మన దేశీయ రక్షణ ఉత్పత్తి కేవలం రూ.46,000 కోట్లు. నేడు అది రికార్డు స్థాయిలో రూ.1.54 లక్షల కోట్లకు చేరింది, త్వరలోనే రూ.1.75 లక్షల కోట్లను దాటుతుంది. ఒకప్పుడు రూ.600 కోట్ల లోపు ఉన్న మన రక్షణ ఎగుమతులు, నేడు సుమారు రూ.40,000 కోట్లకు చేరుకున్నాయి. ఇది మన స్వావలంబన ప్రయాణానికి నిదర్శనం" అని ఆయన వివరించారు. ఈ ప్రాజెక్టులు కేవలం రక్షణ రంగానికే పరిమితం కాకుండా, లక్షలాది ఉద్యోగాలు సృష్టించి, ఒక సంపూర్ణ పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేసి, ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి దోహదపడతాయని అన్నారు. బెంగళూరుకు సమీపంలో ఉన్న ఈ ప్రాంతాన్ని కర్ణాటకతో కలిసి ఒక భారీ 'మిలిటరీ ఇండస్ట్రియల్ కాంప్లెక్స్'గా తీర్చిదిద్దే ప్రణాళికపై ఆలోచించాలని ఆయన చంద్రబాబుకు సూచించారు. దేశ నిర్మాణం అందరి భాగస్వామ్యంతోనే సాధ్యమని, ఈ చారిత్రక కార్యక్రమానికి సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన బృందానికి, రాష్ట్ర ప్రజలకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

**ఇకపై పుట్టపర్తి భక్తికే కాదు.. దేశ భద్రతకు కూడా కేరాఫ్ అడ్రస్: సీఎం చంద్రబాబు**

ప్రశాంతతకు, ఆధ్యాత్మికతకు నెలవైన పుట్టపర్తి గడ్డపై దేశ రక్షణ రంగంలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. దేశీయ పరిజ్ఞానంతో ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్లను తయారుచేసే ప్రతిష్ఠాత్మక అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఆవీజూా - ఆమ్కా) ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ ప్రాజెక్టుతో పుట్టపర్తి ఇకపై భక్తికే కాకుండా దేశ భద్రతకు కూడా కీలక చిరునామాగా మారుతుందని సీఎం చంద్రబాబు అన్నారు.

**పుట్టపర్తిలో నూతన అధ్యాయం**

పుట్టపర్తి ఇకపై ఆధ్యాత్మిక స్ఫూర్తి నుంచి వ్యూహాత్మక ఆవిష్కరణల కేంద్రంగా మారుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'ఆంకా' ప్రాజెక్టు ద్వారా 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్ కీలక భాగస్వామి అవుతుందని ఆయన తెలిపారు. ప్రాథమికంగా రూ.15,803 కోట్ల వ్యయంతో 650 ఎకరాల్లో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తున్నామని, దీని ద్వారా తొలిదశలో 7,500 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని వివరించారు. భవిష్యత్తులో ఈ ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతానికి సుమారు లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. స్వదేశీ సాంకేతికతతో అత్యాధునిక యుద్ధ విమానాలను తయారు చేయడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.

**జెట్ స్పీడ్‌తో అనుమతులు**

ఈ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేసిన వేగాన్ని సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇది 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నుంచి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు నిదర్శనమని అన్నారు. "ఈ ఏడాది 9వ తేదీన రక్షణ శాఖలో చర్చలు మొదలైతే, 20న ప్రతిపాదనలు అడిగారు. 24న మేం పంపాం, 28న కేంద్రం అంగీకరించింది. 29న అధికారులు స్థలాన్ని పరిశీలించి, 30న రాష్ట్ర కేబినెట్ ఆమోదించింది. ఈరోజు శంకుస్థాపన చేసుకున్నాం. జెట్ స్పీడ్‌తో ఫైటర్ జెట్ ప్రాజెక్టును సాధించాం" అని చంద్రబాబు వివరించారు. ఈ ప్రాజెక్టు మంజూరులో కీలక పాత్ర పోషించిన ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

**ఏపీకి రక్షణ కవచం**

'ఆమ్కా' ప్రాజెక్టుతో పాటు రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న ఇతర రక్షణ, అనుబంధ పరిశ్రమల గురించి కూడా సీఎం ప్రస్తావించారు. మడకశిరలో భారత్ ఫోర్జ్, హెచ్‌ఎఫ్‌సీఎల్, దోనకొండలో బీడీఎల్ సంస్థలు రూ.2,959 కోట్ల పెట్టుబడులు పెడుతున్నాయని, దీనివల్ల 4-5 వేల ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేస్తున్న డ్రోన్ సిటీ ద్వారా దేశంలోనే ఆధునిక డ్రోన్ ఎకోసిస్టమ్‌కు శ్రీకారం చుట్టామని, రూ.686 కోట్ల పెట్టుబడులతో 8 సంస్థలు వస్తున్నాయని, తద్వారా 2,500 మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. శ్రీహరికోట నుంచి అంతరిక్ష శక్తి, నాగాయలంక నుంచి క్షిపణి శక్తి, విశాఖ నుంచి నౌకాదళ శక్తి, ఇప్పుడు పుట్టపర్తి నుంచి వైమానిక శక్తితో ఆంధ్రప్రదేశ్ దేశానికి రక్షణ కవచంగా నిలుస్తోందని చంద్రబాబు అన్నారు.

**రత్నాల సీమగా రాయలసీమ**

గతంలో కరవు సీమగా, రాళ్ల సీమగా పిలవబడిన రాయలసీమ రూపురేఖలు మారుస్తున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. "ఒకప్పుడు శ్రీకృష్ణదేవరాయల కాలంలో వీధుల్లో రత్నాలు రాశులుగా పోసి అమ్మిన ఈ గడ్డను మళ్లీ రత్నాల సీమగా మార్చే బాధ్యత ఎన్డీయే ప్రభుత్వం తీసుకుంది" అని ఆయన అన్నారు. పెనుకొండలో కియా పరిశ్రమ విజయాన్ని ఉదాహరణగా చూపుతూ, కరువు సీమలో తయారైన కార్లు నేడు 80 దేశాల్లో తిరుగుతున్నాయని గుర్తుచేశారు. కడప స్టీల్ ప్లాంట్‌ను 2028 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కర్నూలు జిల్లా జొన్నగిరిలో గోల్డ్ ఫీల్డ్స్ ద్వారా త్వరలో బంగారం ఉత్పత్తి ప్రారంభమవుతుందని, రాయలసీమకు రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి పరిశ్రమలను కూడా తీసుకువస్తామని చెప్పారు.

**నీటిపారుదల, పరిశ్రమలతో దశ మార్పు**

రాయలసీమ అభివృద్ధికి నీటిపారుదల ప్రాజెక్టులే పునాది అని చంద్రబాబు పేర్కొన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ హయాంలో ప్రారంభమైన హంద్రీనీవా, తెలుగుగంగ వంటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరందిస్తామని హామీ ఇచ్చారు. గొల్లపల్లి రిజర్వాయర్ వల్లే కియా మోటార్స్ రాగలిగిందని గుర్తుచేశారు. సమర్థవంతమైన నీటి నిర్వహణతో నేడు మే నెలలో కూడా పుట్టపర్తి చెరువు నిండుగా ఉందని, ఇది సుపరిపాలనకు నిదర్శనమని అన్నారు. ఖనిజ వనరులను సద్వినియోగం చేసుకుంటూ స్టీల్, సిమెంట్ పరిశ్రమలను, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను ప్రోత్సహించి సీమ దశ మారుస్తామని భరోసా ఇచ్చారు.

**రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యం**

గత ఐదేళ్ల విధ్వంసకర పాలనతో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలను తరిమేసి, క్రిమినల్ రాజకీయాలు చేశారని విమర్శించారు. ఈ క్లిష్ట సమయంలో ప్రధాని మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో కలిసి రాష్ట్ర పునర్నిర్మాణానికి హామీ ఇచ్చామని గుర్తుచేశారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో రాష్ట్రానికి మళ్లీ బ్రాండ్ ఇమేజ్ తీసుకొస్తామని చెప్పారు. తమ ప్రభుత్వం 23 నెలల్లోనే రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించిందని, వీటి ద్వారా 24 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని ప్రకటించారు. రాష్ట్ర యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా ఇక్కడే అవకాశాలు కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

**పొదుపు ఉద్యమానికి పిలుపు**

ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల (ఇరాన్-అమెరికా యుద్ధం) నేపథ్యంలో దేశ ఆర్థిక భద్రత కూడా ముఖ్యమని చంద్రబాబు అన్నారు. పెరుగుతున్న క్రూడ్ ఆయిల్ ధరలు, దిగుమతుల భారాన్ని తగ్గించేందుకు ప్రధాని మోదీ ఇచ్చిన ఏడు సూత్రాల పొదుపు మంత్రాన్ని పాటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వర్క్ ఫ్రమ్ హోమ్, బంగారం కొనుగోళ్ల తగ్గింపు, ప్రజా రవాణా వినియోగం, వంట నూనెల వాడకం తగ్గింపు, స్వదేశీ వస్తువుల ప్రోత్సాహం వంటివి పాటించి దేశానికి అండగా నిలవాలని కోరారు. ప్రభుత్వం కూడా కాన్వాయ్‌లను తగ్గించడం వంటి చర్యలు చేపట్టిందని, ఈ పొదుపు ఉద్యమంలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సంక్షోభాన్ని అవకాశంగా మార్చుకుని ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

## మోదీ విమానానికి ఎస్కార్ట్..

ప్రపంచం మొత్తంమీద ఉందని చెప్పారు. హర్మూజ్ విషయంలో అంతా అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడి ఉండాలన్నారు. యూఏఈ పర్యటనకు వెళ్లిన ప్రధాని మోదీ సమక్షంలో భారత్ పలు కీలక ఒప్పందాలు చేసుకుంది. ఎల్పీజీ సరఫరా, పెట్రోలియం నిల్వలపై ఎంవోయూ కుదుర్చుకుంది. అంతేకాకుండా వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యం, నౌకల మరమ్మతు కేంద్రం ఏర్పాటు తదితర అంశాలకు సంబంధించిన ఎంవోయూలపై భారత అధికారులు సంతకాలు చేశారు.

**నీట్ పేపర్ లీక్..**

## కీలక సూత్రధారి అరెస్టు

నిందితుడితో కలిసి ఏప్రిల్ చివరి వారంలో పుణెలోని తన నివాసంలో ప్రత్యేక తరగతులు నిర్వహించాడు. నీట్ పరీక్షలో వచ్చే ప్రశ్నలను, సమాధానాలను ముందుగానే విద్యార్థులకు ప్రాక్టీస్ చేయించాడు. నోట్‌బుక్‌లో రాసుకున్న ప్రశ్నలే మే 3న జరిగిన నీట్ పరీక్షలో వచ్చినట్లు సీబీఐ అధికారులు గుర్తించారు. ఈ సెషన్‌లో పాల్గొన్న విద్యార్థుల నుంచి నిందితులు లక్షలాది రూపాయలు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. కెమిస్ట్రీ ప్రశ్నాపత్రం ఎక్కడ నుంచి లీకైందనే విషయంతోపాటు నగదు లావాదేవీల్లో ఉన్న మధ్యవర్తులను కనుగొన్నట్లు సీబీఐ అధికార ప్రతినిధి వెల్లడించారు. గత 24 గంటల్లో దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో సోదాలు నిర్వహించామని, కీలక దస్త్రాలు, పలు ఎలక్ట్రానిక్ పరికరాలు సీజ్ చేశామన్నారు. వాటికి ఫోరెన్సిక్, సాంకేతిక విశ్లేషణ జరుగుతోందని చెప్పారు.

## వైసీపీ నేతలు రాక్షసులు

ఒడిగట్టిన వారు వైసీపీ కార్యకర్తలేనని ఆమె సంచలన ఆరోపణ చేశారు. బాలిక శవం కోసం ఐదు రోజుల పాటు గాలిస్తుంటే కనపడని వైసీపీ నేతలు, ఇప్పుడు నిందితులను పరామర్శిస్తూ తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నేతలు మనుషులు కాదు, రాక్షసులంటూ ఆమె విరుచుకుపడ్డారు. రాయలసీమ అభివృద్ధిపై చర్చకు తాము సిద్ధమని, వైసీపీ నేతలకు దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని బైరెడ్డి శబరి సవాల్ విసిరారు. అక్రమాలకు పాల్పడే వారు ఎవరైనా, చివరికి టీడీపీ వారైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అలాగే ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, కష్టపడి వ్యాపారాలు చేసుకోవడం తప్పా అని ప్రశ్నించారు.

## ఒంటరిగా వెళ్లి దెబ్బతిన్నాం.. ఏపీలో పరిస్థితులు వేరు..

సహకరిస్తాయి. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం మనకు కుంకీ ఏనుగుల్ని పంపించడమే అందుకు నిదర్శనం. జనసేన పార్టీ కుటుంబం నడిపేది కాదు.. కేవలం సిద్ధాంతపరంగా మాత్రమే పార్టీ నడవాలని నా ఆలోచన. పైరవీలతో వచ్చి పదవులు కావాలంటే కుదరదు. ఆర్ఎస్ఎస్, భాజపాల నుంచి మనం చాలా నేర్చుకోవాలి. పెద్ద స్థాయి నాయకులు కూడా పార్టీ కోసం చిన్నస్థాయి కార్యకర్త స్థాయిలో పని చేస్తారు. స్థానిక వివాదాలు పరిష్కరించేందుకు నియోజకవర్గ స్థాయిలో కూడా కమిటీ ఏర్పాటు చేస్తాం. కొందరు పదవులు తీసుకుని సభ్యత్వం కూడా సరిగా చేయలేదు. అలాంటి వారు నాయకులుగా ఎలా ఎదుగుతారు?

**అరకొర జ్ఞానం ఉన్న వైకాపా నేతల మాటలు నమ్మొద్దు**

కులాలు, మతాల ప్రస్తావన లేకుండా రాజకీయాలు చేయలేని పరిస్థితి ఉంది. కొంతమంది నాస్తికులమని చెబుతారు.. కానీ కులాన్ని మాత్రం వదులుకోరు. కులాల వారీగా స్కూళ్లు, హాస్టళ్లు పెట్టి కులాన్ని తీసేసి మాట్లాడాలంటే ఎలా? అందుకే కులాలను కలిపే ఆలోచన విధానంతో జనసేన పనిచేస్తోంది. నేను కూడా ఓ కులంలో పుట్టాను.. అంత మాత్రాన అదే కులానికి పరిమితం కాను. నేను కులం కోసం పనిచేయను. దేశం కోసం, సమాజం కోసం పనిచేసేందుకు వచ్చా. పార్టీ కోసం సమయాన్ని కేటాయిస్తా. మిమ్మల్ని కూడా తరచుగా కలుస్తాను. అరకొర జ్ఞానంతో ఉన్న వైకాపా నేతల మాటలను మీరు నమ్మొద్దు. అంతర్జాతీయ పరిస్థితులతో పెట్రోల్, గ్యాస్ ధరలు పెరిగితే మోదీని విమర్శిస్తారు. ఇంధన పొదుపుపై మనం కూడా దృష్టి సారిద్దాం. స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రాధాన్యాన్ని గుర్తించి పని చేయాలి. మీ ఆత్మగౌరవానికి ఇబ్బంది లేకుండా కలిసి నడవాలి" అని పవన్ అన్నారు.

## త్వరలో కర్నూలుకు హైకోర్టు బెంచ్

ఆశ్చర్యపోయారు. సత్యసాయిబాబా విజన్‌ను ఇప్పుడు చూస్తున్నాం. డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ వల్లే రాష్ట్రానికి మరిన్ని ప్రయోజనాలు. దేశంలో నమో అంటే నరేంద్రమోదీ.. ఏపీలో నాయుడు, మోదీ జోడీ. ప్రధాని మోదీ, రాజ్‌నాథ్ సింగ్, చంద్రబాబు.. ముగ్గురికీ 75 ఏళ్లు అయినా.. 25 ఏళ్ల కుర్రాళ్లలా పనిచేస్తున్నారు. రాష్ట్రంలో పెట్టుబడుల వరద కొనసాగుతోంది. త్వరలో కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు కాబోతోంది. రాయలసీమ ప్రాంతం మరింత అభివృద్ధి కాబోతోంది. 23 నెలల్లో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఏంటో చూపించాం" అని లోకేశ్ అన్నారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, పలువురు రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు.

## కాటన్ ఆశయాలతో ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి

సర్‌ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఆంగ్లేయుడైనా కాటన్ ముందు చూపుతో ధవళేశ్వరం, కృష్ణా బ్యారేజిలతో పాటు ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో కాలువల నిర్మాణాలు చేసిన మహానుభావుడు అని కొనియాడారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో పోలవరం ప్రాజెక్టుతో పాటు ఇరిగేషన్ శాఖ, విధ్వంశంతో కాటన్ ఆత్మసైతం క్షోభించిందని అన్నారు. విధ్వంశానికి గురైన పోలవరం ప్రాజెక్టుతో పాటు, ఇరిగేషన్ రంగాన్ని చంద్రబాబు గాడిలో పెట్టారని, గోదావరి నదిపై కాటన్ ధవళేశ్వరం బ్యారేజి తరువాత మళ్ళీ చంద్రబాబు సారధ్యంలోనే పోలవరం నిర్మాణం అవుతుంది అని తెలిపారు. కాటన్ స్ఫూర్తితో ధవళేశ్వరం బ్యారేజ్ కు 117 కొత్తగేట్ల ఏర్పాటు కోసం 150.09 కోట్లు కేటాయించాం అని త్వరలోనే పనులు చేపట్టి, గేట్ల అమరిక పనులు పూర్తి చేస్తామని తెలిపారు. గోదావరి డెల్టా ప్రక్షాళన కోసం 14 కోట్లతో లైడార్ సర్వే పూర్తి చేయగా, ఆ సర్వే ఆధారంగా డిపిఆర్ తయారు చేస్తున్నాం అని అన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో రైతులకు సకాలంలో సాగు నీరు కూడా అందించలేదని, వేల కోట్లు పెట్టి నిర్మించిన ప్రాజెక్టులకు, వార్షిక నిర్వహణ లేకపోవడంతో శిధిలావస్థకు చేరుకున్నాయని, కూటమి ప్రభుత్వం వచ్చిన తొలి ఏడాదిలోనే 790 కోట్లు కేటాయించి కాలువలు, డ్రైన్లలో తూడు, గుర్రపుడెక్క, పూడిక తీత వంటి పనులు పూర్తి చేశామని స్పష్టం చేశారు. రానున్న ఖరీఫ్ సీజన్ నాటికి కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, పూడిక తొలగింపు పనుల కోసం 397 కోట్లు కేటాయించి పనులు చేస్తున్నాం అని తెలిపారు.

## 'దూరదర్శిని కలిపింది ఇద్దరినీ' చిత్ర యూనిట్

విలన్ పాత్రలో విజయ్ కృష్ణారెడ్డి అద్భుతంగా నటించారని మేనేజర్ స్వామి కొనియాడారు. ఒకనాటి ప్రముఖ నటులు శ్రీహరి, గోపీచంద్ ల కరుడుగట్టిన విలనిజం పాత్రలను గుర్తుకు తెచ్చేలా ఆయన నటన సాగిందని ప్రశంసించారు. ప్రస్తుతం టాలీవుడ్‌లో స్థానిక తెలుగు విలన్ల కొరతను తీర్చేలా ఒక పవర్‌ఫుల్ నటుడు ఈ చిత్రం ద్వారా పరిచయం కావడం పరిశ్రమకు ఎంతో ప్లస్ అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సినిమాకు సంబంధించిన కీలక సన్నివేశాలన్నింటినీ యానాం పరిసర ప్రాంతాల్లోని అందమైన లోకేషన్లలో చిత్రీకరించినట్లు మేనేజర్ తెలిపారు. సినిమా అవుట్‌పుట్ చాలా అద్భుతంగా వచ్చిందని, చిత్రంలో పనిచేసిన నటీనటులు, సాంకేతిక నిపుణులు తమ వంతు ఉత్తమ ప్రతిభను కనబరిచారని వారు పేర్కొన్నారు. చిత్ర దర్శకుడికి, నటీనటులకు, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రేక్షకులందరూ థియేటర్లలో ఈ సినిమాను చూసి, ఆదరించి, ఘన విజయం చేకూర్చాలని వారు కోరారు. చిత్ర యూనిట్ తో పాటు అభిమానులు ప్రేక్షకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పొదుపు చర్యల్లో భాగంగా ఈసారి హైబ్రిడ్ మోడ్‌లో మహానాడు

సంక్షోభం (ఆయిల్ క్రైసిస్) కారణంగా పొదుపు చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు తెలిపారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మే 27, 28 తేదీల్లో మహానాడును హైబ్రిడ్ పద్ధతిలో జరపనున్నట్లు పల్లా శ్రీనివాస రావు వివరించారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి పొలిట్‌బ్యూరో, రాష్ట్ర స్థాయి సభ్యులు మాత్రమే హాజరవుతారని తెలిపారు. అదే సమయంలో, రాష్ట్రవ్యాప్తంగా 1,848 క్లస్టర్ల వద్ద ప్రత్యేకంగా స్క్రీన్లు ఏర్పాటు చేసి, ఒక్కో క్లస్టర్ వద్ద సుమారు 500 మంది కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పొదుపు చర్యల్లో భాగంగా, మే 18, 19, 20 తేదీల్లో జరగాల్సిన మినీ మహానాడులతో పాటు, 23, 24 తేదీల్లోని పార్లమెంట్ స్థాయి మహానాడులను కూడా రద్దు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. పార్టీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని నాయకులు, కార్యకర్తలు స్వాగతించాలని కోరారు.

## అమెరికా ఆ ట్రాప్‌లో పడొద్దన్న చైనా

తీవ్రస్థాయిలో విభేదాలు నెలకొంటాయి. ఒక్కోసారి యుద్ధం అనివార్యమయ్యే పరిస్థితులు ఎదురవుతాయి. గతంలో యుద్ధాలు జరిగిన సందర్భాలూ అనేకం. దీనినే థుసిడైడ్స్ ట్రాప్ అని పిలుస్తారు. 480 బీసీలో ఈ పదానికి బీజం పడింది. నాడు గ్రీకులు రెండవ పర్షియన్ దండయాత్రను విజయవంతంగా తిప్పికొట్టారు. ఆ తర్వాత ప్రాచీన గ్రీక్ ప్రపంచంలో ఏథెన్స్, స్పార్టా రాజ్యాలు ఆధిపత్య శక్తులుగా ఆవిర్భవించాయి. అజియన్ సీ అంతటా ఏథెన్స్ తన ప్రభావాన్ని విస్తరించుకుంది. అప్పటికే సుప్రీంలీడర్‌గా ఉన్న స్పార్టా రాజ్యంలో ఇదంతా తీవ్ర అశాంతిని సృష్టించింది.

**ఏ యుద్ధంతో ఈ పదం వచ్చిందంటే..?**

ఏథెన్స్ ఎదుగుదల, స్పార్టాలో కలిగిన ఆందోళన యుద్ధాన్ని అనివార్యం చేశాయని గ్రీక్ చరిత్రకారుడు థుసిడైడ్స్ అభివర్ణించారు. గ్రీస్ ప్రధాన భూభాగంపై ఆధిపత్యం కోసం రెండూ ఘర్షణకు దిగాయి. ఇదే పెలొపొనేషియన్ యుద్ధం. 27 ఏళ్ల పాటు జరిగిన యుద్ధం వల్ల రెండు శక్తులు బలహీన పడ్డాయి. అదే గ్రీస్ స్వర్ణయుగానికి ముగింపు పలికింది. థుసిడైడ్స్ ఈ వార్‌కు అక్షరరూపం ఇచ్చారు. ఆయన పేరు మీదుగానే థుసిడైడ్స్ ట్రాప్ అనే పదం వచ్చింది. దానిని 2012లో అమెరికా రాజకీయ విశ్లేషకుడు గ్రాహమ్ అలిసన్ పాపులర్ చేశారు. తర్వాత 'ఐవర్‌ఱఅవస టశీ తీ ఔతీ' పుస్తకంలో ఈ పదానికి మరింత వివరణ ఇచ్చారు. హార్వర్డ్ బెల్ఫర్ సెంటర్‌లో జరిపిన పరిశోధనలో భాగంగా 500 ఏళ్ల కాలంలో ఇలాంటి 16 ఉదాహరణలను గుర్తించారు. 12 కేసుల్లో యుద్ధాలు జరిగాయి. ఎదుగుతున్న శక్తి, అప్పటికే సుప్రీంలీడర్‌గా ఉన్న దేశం మధ్య యుద్ధం అనివార్యమని చెప్పడం థుసిడైడ్స్ ట్రాప్ ఉద్దేశం కాదు. ఎదుగుతున్న దేశం ఆకాంక్షలు, ఇప్పటికే అంతర్జాతీయ క్రమానికి కొత్తరూపం ఇవ్వాలన్న కోరిక.. అగ్రరాజ్యంగా ఉన్న దేశంలో భయం, ఆందోళన, తన పట్టును నిలుపుకోవాలనే ప్రయత్నానికి దారితీస్తాయి. ఈ అధికారిక మార్పు పలు ఒత్తిళ్లకు దారితీస్తుందని హెచ్చరించడమే ఇక్కడ అసలు లక్ష్యం.

**అమెరికా-చైనాను ఆ రాజ్యాలతో పోలుస్తూ..**

ఇప్పుడు అమెరికా అగ్రరాజ్యంగా ఉండగా.. చైనా అంతర్జాతీయంగా తన పట్టును పెంచుకుంటూ వస్తోంది. అప్పటి స్పార్టా-ఏథెన్స్‌ను ఇప్పటి అమెరికా-చైనా తో రాజకీయ విశ్లేషకులు పోల్చుతున్నారు. ఆర్థిక, సైనిక, సాంకేతిక శక్తిగా ఉన్న అమెరికాను కొన్నేళ్లుగా చైనా సవాలు చేస్తోంది. డ్రాగన్ తన సైనిక సామర్థ్యాలను పెంచుకుంటోంది. బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ ద్వారా అంతర్జాతీయంగా పట్టును ప్రదర్శిస్తోంది. కృత్రిమ మేధ, సెమీకండక్టర్స్, వాణిజ్యం ఇలా పలు రంగాల్లో అగ్రరాజ్యానికి పోటీదారుగా ఉంది. ఇదే అమెరికాను భయపెడుతోంది. చైనాను కట్టడి చేసేందుకు టారిఫ్ వేయడం, సాంకేతిక అంశాల్లో ఆంక్షలను కఠినతరం చేయడం, ఆసియాలో మిలిటరీ భాగస్వామ్యాలను బలోపేతం చేయడం వంటి ప్రయత్నాలు చేస్తోంది. చైనా తన శక్తికి తగిన ప్రభావాన్ని, గుర్తింపును కోరుకుంటుండగా.. తన చిరకాల ఆధిపత్యాన్ని కోల్పోతానేమోనని అమెరికా భయపడుతోంది. ఇవన్నీ గమనించే ట్రంప్‌నకు జిన్‌పింగ్ హెచ్చరిక లాంటి సలహా ఇచ్చారు. బీజింగ్‌ను శత్రువుగా చూడకుండా తనతో సమాన శక్తిగా గుర్తించి సంప్రదింపులు జరపాలన్నదే జిన్‌పింగ్ ఆలోచనగా కనిపిస్తోంది.

# ఎడిటర్ వాయిస్

## బాబు బాటలోనే లోకేష్.. మ్యాటర్ ఏంటంటే...!

ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమికి నేతృత్వం వహిస్తున్న టిడిపిలో ఒక చర్చ ఉంది. నాయకుల విషయంలో చంద్రబాబు సంతృప్తి చెందడం అనేది చాలా కష్టమైన విషయం అనే భావన నాయకులు ఆది నుంచి వినిపిస్తున్నారు. తాము ఎంత పని చేసినప్పటికీ చంద్రబాబు అంత త్వరగా సంతృప్తి చెందరని, మరింత కష్టపడితే తప్ప మార్పులు వేయరని నాయకులు తరచుగా చెబుతూ ఉంటారు. గతంలో మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలలో అనేకమంది నాయకులు ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు.

చంద్రబాబును మెప్పించడం అంత తేలిక కాదని, తాము 100% కష్టపడితే చంద్రబాబు దగ్గర 10% కూడా మార్కులు రావని చాలామంది నాయకులు చెబుతూ ఉంటారు. పార్టీ విధానాలను గమనిస్తే ఇదే విషయం తెలుస్తుంది. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను తను స్వయంగా తెలుసుకోవడంతో పాటు నాయకులు చెబుతున్న విషయాలను బేరీజు వేసుకొని చంద్రబాబు పోల్చి చూసుకుంటారు. ఆ తర్వాత నాయకుల విషయంలో నిర్ణయానికి వస్తారు. ఇది నాయకులకు ఒక రకంగా ఇబ్బందికర అంశమే అయినప్పటికీ పార్టీని డెవలప్ చేసే విషయంలో చంద్రబాబు నిర్ణయాన్ని తప్పు పట్టే అవకాశం లేదు.

అయితే ఇప్పుడు పార్టీలో యువతరం వచ్చింది. పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నారా లోకేష్ నియమితులయ్యారు. దీంతో ఈ వ్యవహారంపై నాయకులు ఆశలు పెట్టుకున్నారు. అంటే తాము పడుతున్న కష్టానికి మంచి మార్కులు వస్తాయి అని వారు అంచనా వేస్తున్నారు. కానీ, నారా లోకేష్ వ్యవహారాన్ని గమనించినప్పటికీ నాయకుల విషయంలో ఈ తరహా పరిస్థితి ఉండడం లేదని చెబుతున్నారు. చంద్రబాబు మాదిరిగానే నారా లోకేష్ కూడా వ్యవహరిస్తున్నారన్నది పార్టీలో జరుగుతున్న అంతర్గత చర్చ.

అంత తేలికగా నాయకులకు మార్కులు వేసే పరిస్థితి నారా లోకేష్ దగ్గర కూడా లేదని ఎంతో కష్టపడితే తప్ప ఆయన దగ్గర మార్పులు సంపాదించడం చాలా కష్టమని అంటున్నారు. రాయలసీమకు చెందిన కొంతమంది ఎమ్మెల్యేలు ఇటీవల నారా లోకేష్ ను కలిశారు. తమ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, అదేవిధంగా ప్రజల సంతృప్తి అంశాలపై వారు ఒక నివేదికను అందజేశారు. కానీ ఇదే సమయంలో ఆయన వెంటనే వారిని పాఠశాలల పరిస్థితి ఏ విధంగా ఉంది.. మధ్యాహ్నం భోజనం పై వస్తున్న వార్తలు మీ దృష్టికి వచ్చాయా.. వాటి విషయంలో మీరు ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారు అని ప్రశ్నలు సంధించారు.

దీంతో వారు ఒక్కసారిగా అవాక్కయ్యారు. తాము ఒక కోణంలో ఆలోచిస్తే పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మరింత లోతుగా లోకేష్ ఆలోచించడంతో వారంతా మౌనంగా ఉండిపోయారు. కష్టపడే విషయంలో అన్ని కోణాలను పరిశీలనలోకి తీసుకుంటామని, ఏ చిన్న తేడా వచ్చిన నాయకులకు మార్కులు వేసేది లేదని ఈ సందర్భంగా లోకేష్ చెప్పారు. అంటే ఒక రకంగా చంద్రబాబు బాటలోనే నారా లోకేష్ కూడా పయనిస్తున్నారనే విషయం నాయకులకు స్పష్టమైనది. దీనిని బట్టి నాయకులు తమ పని విధానాన్ని తమ ఆలోచన విధానాన్ని ప్రజలకు చేరువ అయ్యే విధానాన్ని కూడా మరింతగా మెరుగుపరుచుకోవాల్సిన అవసరం స్పష్టం అవుతోంది.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## వంతెన పైనుంచి పడిన ట్రాక్టర్.. ఆరుగురి దుర్మరణం



**హోసపెటే, విశ్వం వాయిస్ న్యూస్ :** కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లారీ ఢీకొట్టడంతో వంతెన పైనుంచి ట్రాక్టర్ కిందపడింది. ఈ ప్రమాదంలో ఏడాది చిన్నారి సహా ఆరుగురు దుర్మరణం పాలయ్యారు. మరో 10 మందికి గాయాలయ్యాయి. కొప్పల తాలూకా మునీరాబాద్ వద్ద వంతెనపై ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం జరిగే సమయానికి ట్రాక్టర్‌లో 16 మంది ఉన్నారు. మునీరాబాద్ సమీపంలోని హులిగమ్మ దర్శనానికి ట్రాక్టర్‌లో భక్తులు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. మృతులను సండూరు, కూడ్లిగి ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించారు. ఘటనాస్థలాన్ని కొప్పల, విజయనగర ఎస్పీలు పరిశీలించారు.

## సహజీవనం చేసిన మహిళ మోసం చేసిందంటూ వ్యక్తి ఆత్మహత్య

**కొహెడ, విశ్వం వాయిస్ న్యూస్ :** సహజీవనం చేసిన మహిళ మోసగించిందని ఆరోపిస్తూ ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొహెడలో ఈ ఘటన చోటుచేసుకుంది. యువతి మోసం చేసిందంటూ వీడియో రికార్డు చేసి గోవర్ధన్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. నాలుగేళ్లుగా గోవర్ధన్, ఆ యువతి సహజీవనం చేస్తున్నారు. పుట్టిన కుమారుడిని ఆమె విక్రయించి మరో వివాహం చేసుకుందని వీడియోలో గోవర్ధన్ ఆరోపించాడు. అతడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## భార్యతో విభేదాలు.. నాలుగేళ్ల కుమార్తెను బావిలో పడేసిన తండ్రి

**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ మండలంలో దారుణం చోటుచేసుకుంది. భార్యపై కోపంతో కుమార్తెను కడతేర్చాడు ఓ కర్కశ తండ్రి. కోరుకొండ మండలంలోని గాడరాడకు చెందిన రామవరపు రాజు, నీలిమ దంపతుల మధ్య గత కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భార్యపై కోపంతో.. తన రెండో కుమార్తె లహరి (4)ని బావిలో పడేసి హత్య చేశాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని చిన్నారి మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కోరుకొండ పోలీసులు తెలిపారు.

## మియాపూర్‌లో సీఏ విద్యార్థి అనుమానాస్పద మృతి

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్‌లో సీఏ విద్యార్థి కుమ్మరి జనార్ధన్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తన గదిలో ఉరికి వేలాడుతూ ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. గదిలో రక్తపు మరకలు ఉండటంతో జనార్ధన్ మృతిపై తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రైవేటు బస్సులో మహిళపై సామూహిక అత్యాచారం

### దిల్లీలో డ్రైవర్, కండక్టర్ అరెస్టు

**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశ రాజధాని దిల్లీలో ఓ 30 ఏళ్ల వివాహితపై ప్రైవేటు స్లీపర్ బస్సు డ్రైవరు, కండక్టరు అత్యాచారానికి తెగబడ్డారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2012 నాటి నిర్భయ సామూహిక హత్యాచార ఉదంతాన్ని ఈ ఘటన గుర్తుకు తెచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 11న రాత్రి మంగోల్‌పురీలో ఓ ఫ్యాక్టరీలో విధులు ముగించుకున్న మహిళ ఇంటికి వెళ్లేందుకు సరస్వతీ విహార్‌లోని బి-బ్లాక్ బస్టాండుకు చేరుకుంది. అక్కడ ఓ ప్రైవేటు స్లీపర్ బస్సు డోరు వద్ద నిల్చొని ఉన్న వ్యక్తిని టైమ్ ఎంత అని అడిగింది. వెంటనే ఆ వ్యక్తి బాధిత మహిళను బస్సులోకి బలవంతంగా ఈడ్చుకెళ్లాడు. బస్సును నంగ్లోయీ మెట్రోస్టేషను సమీపానికి తీసుకెళ్లి మరో వ్యక్తితో కలిసి మహిళపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం తనను బస్సు నుంచి తోసేశారని, ముఖం, చేతులపై గాయాలయ్యాయని బాధితురాలు ఆరోపించింది. సమీప బంధువు సహాయంతో ఇంటికి చేరుకున్నట్లు వెల్లడించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను బస్సు డ్రైవరు, కండక్టరుగా గుర్తించారు. బస్సును సీజ్ చేసి నిందితులను ఈ నెల 12న అరెస్టుచేశారు. వారిని కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. దీనిని సుమోటోగా స్వీకరించిన జాతీయ మహిళా కమిషన్ ఈ ఘటనపై చర్యలు తీసుకొని ఏడు రోజుల్లోగా సమగ్ర నివేదిక అందించాలని దిల్లీ పోలీసులను కోరింది.

ముంబయి మాఫియాలో చేరేందుకు

## తల్లిని కిరాతకంగా చంపేసి..



**రాజాం గ్రామీణం, విశ్వం వాయిస్ న్యూస్ :** నవ మాసాలు మోసి అల్లారు ముద్దుగా పెంచుకున్న కుమారుడే ఆ తల్లిపాలిట శాపంగా మారాడు. 'అలవాట్లు మార్చుకో.. క్రమశిక్షణతో బతుకు.. బాగా చదువుకో..' అని చెప్పిన తల్లి మాటలు ఆ కుమారుడికి రుచించలేదు. ఆమె పెట్టిన చిన్నపాటి ఆంక్షలకు విసుగు చెంది తన స్నేహితుడితో కలిసి కిరాతకంగా కడతేర్చాడు. సభ్యసమాజం నివ్వెరపోయేలా చేసిన ఈ ఘటన విజయనగరం జిల్లా రాజాం పట్టణ పరిధిలోని డోలపేటలో చోటుచేసుకుంది. చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు తెలిపిన ప్రకారం.. కేసు వివరాలివీ.. డోలపేటకు చెందిన ముంజేటి స్పందన (34) ఈనెల 4న హత్యకు గురయ్యారు. ఇంటి పక్కనున్న చెరువులో ఆమె మృతదేహం లభ్యమైంది. అప్పటికే కుమారుడు (16) అదృశ్యమయ్యాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు స్పందన మృతిపై రాజాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతురాలి శరీరంపై 16 కత్తిపోట్లు ఉన్నట్లు గుర్తించారు. ప్రధానంగా కుమారుడి అదృశ్యం, ఇంట్లోని బంగారం మాయం కావడంతో అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆ దిశగా దర్యాప్తు కొనసాగించారు. ఈ క్రమంలో కుమారుడే తన స్నేహితుడి (మైనర్) సాయంతో తల్లిని పాశవికంగా హతమార్చినట్లు నిర్ధరణకు వచ్చారు. తల్లి చెప్పిన మంచి మాటలు రుచించకపోవడం, జపాన్ యానిమేషన్ మాఫియా సినిమాల ప్రభావంతో ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తేల్చారు. సుమారు ఐదున్నర తులాల బంగారం తీసుకుని ముంబయి పారిపోవడానికి యత్నించారు. అక్కడికి వెళ్లి మాఫియాలో చేరాలనే లక్ష్యంతో ఇద్దరు మైనర్లు ఈ హత్యకు పాల్పడినట్లు డీఎస్పీ తెలిపారు. సాంకేతిక ఆధారాలతో నిందితులను తిరుపతిలో అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

## మూడు యావజ్జీవ కారాగార శిక్షలు

### పోక్సో నిందితునికి అరుదైన దండన

**కొల్లం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒక మైనర్ బాలికపై ఏడాదిపాటు పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన 39 సంవత్సరాల నిందితునికి కేరళలోని ఒక కోర్టు గురువారం మూడు యావజ్జీవ కారాగార శిక్షలు విధించింది. కరునగపల్లి ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి రాజీవన్ వాచల్ వివిధ చట్టాల కింద ముద్దాయికి శిక్ష ఖరారు చేశారని, ముద్దాయికి రూ.3 లక్షల జరిమానా కూడా విధించారని ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్.సి.ప్రేమ్‌చంద్రన్ వెల్లడించారు. బాధితురాలు ఐదో తరగతి చదువుతున్న సమయంలో ప్రారంభమైన అత్యాచార ప్రక్రియ ఏడాది వరకూ కొనసాగిందని ప్రాసిక్యూటర్ వెల్లడించారు. చదువుపై, ఇతర విషయాలపై బాలిక శ్రద్ధ కోల్పోవడం గమనించిన తల్లి ఆమెను పాఠశాల సలహాదారుని వద్దకు తీసుకెళ్లగా అక్కడ నేరం గుట్టు రట్టైంది. బాలల సంక్షేమ కమిటీ సూచన మేరకు కేసు నమోదు చేసి పోలీసులు విచారణ జరిపారు.

## పొలానికి నిప్పు పెట్టబోయి.. రైతు సజీవ దహనం

**నరసరావుపేట సెంట్రల్, విశ్వం వాయిస్ న్యూస్ :** మొక్కజొన్న వ్యర్థాలకు నిప్పుపెడుతుండగా ఒక్కసారిగా మంటలు ఎగిసిపడడంతో రైతు సజీవదహనమైన ఘటన పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం గురవాయపాలెంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన వి.రామారావు (60) ఇటీవల మొక్కజొన్న పంట కోశారు. పొలంలో ఉన్న వ్యర్థాలను దహనం చేద్దామని బుధవారం వెళ్లి నిప్పు పెట్టగా ఒక్కసారిగా మంటలు ఎగిశాయి. ఆ మంటల్లో చిక్కుకొని రామారావు మృతిచెందారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని గ్రామీణ పోలీసులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి నానిని అడగ్గా మొక్కజొన్న పొలంలో వ్యర్థాలకు నిప్పుపెడుతూ మంటల్లో చిక్కుకొని మృతిచెందాడని నిర్ధారించారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే అరవిందబాబు రామారావు మృతదేహాన్ని సందర్శించి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

ఉపాధిహామీ పనుల్లో నిర్లక్ష్యం వహించిన

## అధికారులపై కలెక్టర్ కఠిన చర్యలు

- 2 ఏపీఓలు, 4 టెక్నికల్ అసిస్టెంట్లు, 4 ఫీల్డ్ అసిస్టెంట్లు సస్పెండ్
- గిరిజన శ్రామికులకు పనిదినాలు కల్పించడంలో వైఫల్యం
- లక్ష్య సాధనలో అత్యల్ప ప్రగతి నమోదు చేసిన సిబ్బంది అధికారులపై చర్యలు
- పనితీరు మెరుగుపరచని క్షేత్ర స్థాయి సిబ్బంది, అధికారులపై భవిష్యత్తులోనూ కఠిన చర్యలు
- జలధార - జలహారతి కార్యక్రమం లక్ష్య సాధనలో నిర్లక్ష్యం నేపథ్యంలో చర్యలు



**రంపచోడవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** పోలవరం జిల్లా వ్యాప్తంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో నిర్లక్ష్యం వహించడం, గిరిజన శ్రామికులకు తగిన పనిదినాలు కల్పించడంలో విఫలమవడం, అలాగే జలధార - జలహారతి కార్యక్రమం లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వంటి కారణాలతో జిల్లా కలెక్టర్ కె దినేష్ కుమార్ ఆదేశాల మేరకు 2 మంది ఏపీఓలు, 4 మంది టెక్నికల్ అసిస్టెంట్లు/ బేర్ ఫుట్ టెక్నీషియన్లు, 4 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేస్తూ విధుల నుండి తప్పించినట్లు డ్వామా పీడీ మహేశ్వరరావు తెలిపారు. ఉపాధి హామీ పథకంలో ప్రతి మండలానికి నిర్దేశించిన పనిదినాల లక్ష్యాలను చేరుకోవడంలో సంబంధిత అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆయన పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో శ్రామికులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహించడం వల్ల ప్రభుత్వ పథకాల అమలుపై ప్రతికూల ప్రభావం పడుతోందన్నారు. పనితీరు అత్యంత నిరాశాజనకంగా ఉండటంతో కఠిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సస్పెండ్ అయిన ఏపీఓలలో వర రామచంద్రాపురం మండలానికి చెందిన ఎం.రెడ్డి బాబు లక్ష్యం 1,27,600 పనిదినాలకు గాను కేవలం 18,667 పనిదినాలు మాత్రమే సాధించి 15 శాతం ప్రగతితో జిల్లాలో 12వ స్థానంలో నిలిచారని, రంపచోడవరం మండలానికి చెందిన బండిల సత్యనారాయణ లక్ష్యం 1,46,000 పనిదినాలకు గాను 23,065 పనిదినాలు మాత్రమే సాధించి 16 శాతం ప్రగతితో జిల్లాలో 11వ స్థానంలో ఉన్నారని తెలిపారు. అదేవిధంగా రంపచోడవరం, కూనవరం మండలాలకు చెందిన టెక్నికల్ అసిస్టెంట్లు మరియు బేర్ ఫుట్ టెక్నీషియన్లు నిర్దేశించిన లక్ష్యాలకు చాలా తక్కువ స్థాయిలో పనులు నమోదు చేయడంతో వారిపై కూడా సస్పెన్షన్ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అలాగే కూనవరం, చింతూరు, అడ్డతీగల మండలాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామ స్థాయిలో పనుల పురోగతిని పెంచడంలో పూర్తిగా విఫలమయ్యారని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం అమలులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, లక్ష్యాల సాధనలో విఫలమయ్యే అధికారులపై భవిష్యత్తులో కూడా కఠిన చర్యలు కొనసాగుతాయని డ్వామా పీడీ మహేశ్వరరావు హెచ్చరించారు. గిరిజన ప్రాంతాల్లో శ్రామికులకు గరిష్ట పనిదినాలు కల్పించేందుకు అధికారులు, క్షేత్ర స్థాయిలో సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు.

రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూలు

## విద్యార్థుల విశేష ప్రతిభ

### 12 తరగతి సి.బి.ఎస్.ఈ. 2026 పరీక్ష ఫలితాలలో...




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇటీవల న్యూఢిల్లీలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ప్రకటించిన సీ.బీ.ఎస్.ఈ. 12వ తరగతి పరీక్షా ఫలితాలలో రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని రాజమహేంద్రి విద్యా సంస్థల డైరెక్టర్ తేతలి సత్య సౌందర్య, స్కూలు ప్రిన్సిపాల్ టీ.వీ.డి. చంద్రశేఖర్ తెలిపారు. సీ.బీ.ఎస్.ఈ. బోర్డు 12 వ తరగతి పరీక్షలు 2026 ఫలితాలలో రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు 100శాతం ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించి, అత్యుత్తమ ఫలితాలతో పాఠశాలకు అపూర్వ విజయాన్ని చేకూర్చడమే కాకుండా పాఠశాల ప్రతిష్టను విద్యార్థులు ఇనుమడింప చేశారని రాజమహేంద్రి విద్యా సంస్థల డైరెక్టర్ తేతలి సత్య సౌందర్య అన్నారు. సీ.బీ.ఎస్.ఈ. 12 వ తరగతి పరీక్షల్లో మునగాల భారతీదేవి ఎం.పీ.సీ గ్రూపులో 469 (94శాతం) మార్కులు సాధించి ప్రథమ స్థానం పొందినది అని, 5 మంది విద్యార్థులు 80 శాతం కంటే ఎక్కువ మార్కులు, 15 మంది విద్యార్థులు 70 % కంటే ఎక్కువ మార్కులు, 51 మంది విద్యార్థులు 60 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించారని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్ తెలియజేశారు. ఈ విజయాలు తమ విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల శిక్షణ, తల్లిదండ్రుల సహకారానికి ప్రతిఫలమని తెలిపారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ఫలితం సాధించిన మునగాల భారతీదేవిని శాలువా కప్పి, పుష్పగుచ్చం ఇచ్చి సన్మానించారు.

రంపచోడవరం రెవిన్యూ డివిజనల్ అధికారిగా

## పదవి బాధ్యతలు స్వీకరించిన కె.స్వాతి



**రంపచోడవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** పోలవరం జిల్లా రంపచోడవరం రెవిన్యూ డివిజనల్ అధికారిగా పదవి బాధ్యతలు స్వీకరించడం జరిగిందని కె.స్వాతి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సబ్ కలెక్టర్ చాంబర్లో పోలవరం జిల్లా రంపచోడవరం రెవిన్యూ డివిజనల్ అధికారి గా పదవి బాధ్యతలు స్వీకరణ కొరకు వచ్చిన నూతన ఆర్డిఓ వారిని సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులు సిబ్బంది పుష్పగుచ్ఛాలతో ఆహ్వానించడం జరిగింది. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నూతన ఆర్డీవోగా కె. స్వాతి బాధ్యతలు స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా రంపచోడవరం నూతన రంపచోడవరం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.స్వాతి మాట్లాడుతూ అనంతపురం జిల్లా హిందూపురం మండలం గురువన హళ్ళి గ్రామానికి చెందిన చెందినవారమని అదేవిధంగా 2022 సంవత్సరంలో ఏపీపీఎస్ గ్రూప్ 1 ఫలితాలలో 8వ ర్యాంకు సాధించి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గా ఎంపికవ్వడం జరిగిందని అదేవిధంగా కొంతకాలం గుంటూరు జిల్లాలోని ప్రొబిషనరీ డిప్యూటీ కలెక్టర్గా శిక్షణ పొందడం జరిగిందని ఆమె అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రంపచోడవరం రెవిన్యూ డివిజనల్ అధికారిగా నియమించడం జరిగిందని ఆమె అన్నారు. గిరిజన ప్రాంతంలోని రెవిన్యూ శాఖకు సంబంధించిన సమస్యలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సమస్యలు పరిష్కరించే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆమె అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంతో పాటు, ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆర్డీవో కె. స్వాతి తెలిపారు. రెవెన్యూ పరిపాలనలో పారదర్శకత, ప్రజలకు మెరుగైన సేవలందించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఆమె పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని ఆమె తెలిపారు. ముందుగా పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్ వారిని మర్యాద పూర్వకంగా కలిసి నూతన ఆర్డీవోగా పదవి బాధ్యతలు స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు సిహెచ్ బాలాజీ, సిహెచ్ శ్రీనివాసరావు, ఏ సత్యనారాయణ, కే సత్యనారాయణ, దొరకయ్య, అమ్మాజీ, వేణుగోపాల్, ఏవో ఎం సావిత్రి, డిప్యూటీ తాసిల్దారులు సరిత, శివ, జిలాని, త్రిమూర్తులు, సి హెచ్ చంటి, అలెగ్జాండర్, దాసు, విజయశాంతి, అశోక్ తదితరులు నూతన ఆర్డిఓ వారిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.

గోదావరి జిల్లాల్లో సిరులకు ప్రాణం పోసిన మహనీయుడు

# సర్ ఆర్ధర్ కాటన్

నేడు కాటన్ 223వ జయంతి







**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ ప్రత్యేకం :** భగీరథుడు ఎలాఉంటాడో ఎవ్వరికీ తెలియదు... అలాంటిది గోదావరి డెల్టా వాసులకు సర్ఆర్ధర్ కాటన్ అపరభగీరథుడుగా నిలిచాడు... అందుకే నేటికీ అన్నదాత ఆయనను నిత్యం స్మరించుకుంటునే ఉంటాడు... ప్రతీ రైతు కాటన్ నామ స్మరణం చేస్తుంటాడు. ఎక్కడో లండన్‌లో పుట్టిన కాటన్‌ను గోదావరి డెల్టా వాసులు గుండెలనిండా పెట్టుకుని నిత్యం స్మరిస్తుంటారు. ధవళేశ్వరం బ్యారేజి వద్ద ఆయన ఆనకట్ట కట్టక పూర్వం గోదావరి జిల్లాలు రాయలసీమ ప్రాంతం మాదిరిగా కరవు కాటకాలతో విలవిలలాడేవి. అలాంటి గోదావరి జిల్లాలు కాటన్ పాద ధూళి స్మర్శతో పునీతమయ్యాయి. ఈ ప్రాంతాలు సస్యశ్యామలంగా విలసిల్లుతున్నాయి. జీవ జలాలు ఉప్పుసముద్రం పాలవ్వటంతో ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించి రెండు జిల్లాల్లో డెల్టా ప్రాంతాల్లో సిరులు పండించిన అపరభగీరథుడుగా నిలిచారు. కాటన్ నిర్మించిన బ్యారేజి ధవళేశ్వరం వద్ద కాటన్ మహనీయుడు 1852లో ఆనకట్ట నిర్మించారు. దాని పొడవు నాలుగు కిలోమీటర్లు. ధవళేశ్వరం బ్యారేజి వద్ద గోదావరినదికి ఎడమవైపున ధవళేశ్వరం, కుడివైపున విజ్జేశ్వరం మధ్యలో నాలుగు కిలోమీటర్ల పొడవునా కాటన్ నిర్మించిన ఈ ఆనకట్టకు అప్పట్లో రూ.1,65,000 ఖర్చయింది. ప్రారంభంలో ఈ ఆనకట్టద్వారా గోదావరి డెల్టాలో 4,38,000 ఎకరాలకు సాగునీరు చేరటంతో కాటన్ స్వర్ణయుగాన్ని అందించారు. తర్వాత కాల్వలు, లాకులు విధానాన్ని అభివృద్ధిచేయటంతో రెండు జిల్లాలో జలరవాణా అందుబాటులోకి వచ్చింది. అంతే కాకుండా సాగు విస్తీర్ణం 7,94,829 ఎకరాలకు పెరిగింది. 110 సంవత్సరాలపాటు విశిష్ట సేవలందించిన కాటన్ ఆనకట్ట శిధిలావస్థకు చేరుకోవటంతో కొత్త ఆనకట్ట నిర్మించేందుకు చర్యలు తీసుకున్నారు. కొత్త ఆనకట్ట ఇలా...కాటన్ నిర్మించిన బ్యారేజి శిధిలావస్థకు చేరుకోవటంతో 1970లో అప్పటి ప్రభుత్వం కొత్త బ్యారేజి (ఆనకట్ట) నిర్మించేందుకు రూ.26.59 కోట్లు మంజూరు చేసింది. దీనికి కాటన్ బ్యారేజిగా నామకరణం చేసి 1977 ప్రాంతంలో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ దీనిని జాతికి అంకితం చేశారు. కొత్త కట్టడం ద్వారా కొత్తగా బ్యారేజి నిర్మించటంతో గోదావరిజిల్లాల్లో ఆయకట్టు పది లక్షల ఎకరాలకు పెరిగింది. అలాగే లక్షలాది మందికి తాగునీరు, లక్షలాది పశువులకు తాగునీరు అందిస్తుంది.

గన్నవరం వద్ద అక్విడెక్టు నిర్మాణం 1852కి పూర్వం తూర్పుగోదావరిజిల్లా కోనసీమలోని నగరం దీవి కరవుకాటకాలతో విలయతాండవం చేసేది. 1852లో కాటన్ పి.గన్నవరం వద్ద వైనతేయ గోదావరి నదీపాయమీద అక్విడెక్టు నిర్మించారు. దీని నిర్మాణానికి అప్పట్లో రూ.1,65,935 నిధులు వెచ్చించారు. కేవలం మూడు నెలల వ్యవధిలో నిర్మాణం పూర్తిచేసుకున్న ఈ కట్టడం ద్వారా నగరం దీవిలో 33వేల ఎకరాలకు సాగునీరు అందటంతో ఆ దీవిలో పచ్చదనం పరుచుకుని సిరులు పండాయి. దాని ద్వారా జలరవాణా వృద్ధి అయ్యింది.

### కాటన్ జీవిత చరిత్ర విశేషాలు

1803 మే 15న కాటన్ మహనీయుడు ఇంగ్లండ్‌లో హెన్రీ కేల్‌వెసీ కాటన్, అంబేర్‌మెర్‌ఎబే దంపతులకు జన్మించాడు

1818లో ఏడిస్‌కోంబ్‌లో మిలట్రీలో కేడెట్‌గా చేరారు.

1819లో రెండో లెఫ్ట్‌నెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు.

1820లో వేల్స్ ఇంగ్లండ్‌లో ఆర్డినెన్స్ సర్వే నిమిత్తం వెళ్లారు

1821లో ఇంగ్లండ్ నుంచి భారత్‌కు వచ్చారు.

1822లో పంబన్ స్ట్రెయిట్‌లోని దక్షిణ డివిజన్‌లో ఎ.ఇ.గా బాధ్యతలు తీసుకున్నారు.

1824లో బర్మా యుద్ధంలో పాల్గొన్నారు.

1825లో మద్రాస్‌లోని ట్యాంక్ సర్కిల్‌కు ఎస్.ఇ.గా బాధ్యతలు చేపట్టారు.

1828లో కెప్టెన్‌గా పదోన్నతి లభించింది.

1829లో కన్వెనరీ స్కీముకు ఇన్వెస్టిగేషన్ అధికారిగా వ్యవహించారు.

1830లో ఇంగ్లండ్ వెళ్లేందుకు రెండున్నర సంవత్సరాలపాటు సెలవు తీసుకున్నారు.

1832లో కన్వెరిడెల్టాను వదిలేశారు. ఆ సమయంలో అనారోగ్య కారణంతో ఇంగ్లండ్ వెళ్లారు

1834లో యూరప్, ఆఫ్రికాల మీదుగా ఏడాదిపాటు ప్రయాణం చేసి భారత్‌కు చేరుకున్నారు.

1837లో మద్రాసు పోర్టు అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు వేశారు.

1840లో కృష్ణానదిమీద ఆనకట్ట నిర్మించేందుకు ప్రతిపాదించారు.

1841లో ఎలిజబెత్‌ను వివాహమాడారు.

1843లో భారత్‌కు తిరిగి వచ్చారు.

1844లో విశాఖపట్నం పోర్టును నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధంచేసిన కాటన్ దాంతోపాటే గోదావరి డెల్టాను అభివృద్ధిచేసేందుకు ఒక నివేదికను ప్రభుత్వానికి అందించారు.

1847లో ధవళేశ్వరం బ్యారేజివద్ద గోదావరి నదిమీద ఆనకట్ట నిర్మించేందుకు అనుమతులు లభించాయి.

1847లో కృష్ణానదిపై ఆనకట్ట నిమిత్తం సలహాదారుగా నియమాకం

1848లో అనారోగ్యంతో ఆస్ట్రేలియా వెళ్లారు. అప్పట్లో బాధ్యతలను కెప్టెన్ ఓర్‌కు అప్పగించారు

1840లో భారత్‌కు తిరిగి వచ్చి కల్నల్‌గా బాధ్యతల స్వీకరణ

1852లో పి.గన్నవరం వద్ద గోదావరి నదీపాయ మీద అక్విడెక్టు నిర్మాణం

1852లో ధవళేశ్వరం బ్యారేజి పూర్తి

1858లో ఒరిస్సాలో కరవు సహాయ చర్యలు నిమిత్తం సలహాదారుగా నియమితులైన కాటన్ కాల్వల వ్యవస్థ గురించి సలహాలు ఇచ్చారు

1860లో కాటన్ ఉద్యోగ బాధ్యతలనుంచి పదవీ విరమణ పొందారు

1863లో భారత్‌కు వచ్చి నదీజలాల వినియోగంపై సలహాలు ఇచ్చారు

1877లో కె.సి.ఎస్.ఐ. బిరుదుతో సత్కారం

96 సంవత్సరాల రెండు నెలలపాటు జీవించిన కాటన్ 1899లో అనారోగ్యంతో కన్నుమూశారు.

కాన్వాయ్ వదిలి

# బైక్‌పై అభివృద్ధి పనుల తనిఖీ

ప్రధాని మోదీ పిలుపుతో పొదుపు బాట - ఇంధన పొదుపులో ఎమ్మెల్యే నల్లమిల్లి ఆదర్శం



**అనపర్తి, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన ఇంధన పొదుపు పిలుపుకు స్పందిస్తూ అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వినూత్న రీతిలో ముందడుగు వేశారు. నో వెహికల్ డే సందర్భంగా తన కాన్వాయ్ వాహనాలను పక్కనపెట్టి మోటర్ సైకిల్‌పై కొమరిపాలెం గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. శనివారం ఉదయం ఎమ్మెల్యే నల్లమిల్లి స్వయంగా బైక్ నడుపుతూ కొమరిపాలెం బయలుదేరారు. ఎమ్మెల్యేను అనుసరిస్తూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు సైతం పెద్ద సంఖ్యలో బైక్‌లపైనే గ్రామానికి చేరుకున్నారు. దీంతో కొమరిపాలెం ప్రధాన రహదారి బైక్‌ల ర్యాలీని తలపించింది. గ్రామంలో జరుగుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ, జలజీవన్ మిషన్ పనులను ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల నాణ్యత, పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాంట్రాక్టర్లకు నాణ్యతలో రాజీ పడొద్దని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ "దేశంలో ఇంధన వనరులు పరిమితంగా ఉన్నాయి. ప్రధాని మోడీ గారు ఇచ్చిన ఇంధన పొదుపు పిలుపును ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. వారంలో ఒక్కరోజు 'నో వెహికల్ డే' పాటిస్తే లక్షల లీటర్ల ఇంధనం ఆదా అవుతుంది. దీనివల్ల కాలుష్యం తగ్గడంతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థకూ మేలు జరుగుతుంది. ప్రజాప్రతినిధులు, నాయకులు ముందుండి ఆచరిస్తేనే సామాన్య ప్రజల్లో చైతన్యం వస్తుంది" అని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే తీసుకున్న ఈ నిర్ణయంపై కొమరిపాలెం గ్రామస్తులు, కూటమి శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. "సాధారణంగా నాయకులు కాన్వాయ్‌తో హడావుడి చేస్తారు. కానీ మా ఎమ్మెల్యే సింపుల్‌గా బైక్‌పై వచ్చి పనులు చూడటం చాలా ఆదర్శమని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.

## వెంకటేష్ పుట్టినరోజు పురస్కరించుకొని కామిశెట్టి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు టూర్ ప్రోగ్రాం కన్వీనర్ రాజానగరం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు పెందుర్తి వెంకటేష్ జన్మదిన వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో తెదేపా నాయకులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పెందుర్తి వెంకటేష్ జన్మదినాన్ని పురస్కరించుకొని కోరుకొండ కాంప్లెక్స్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులు కామిశెట్టి దొరబాబు(పాల దొరబాబు) మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ మాజీ శాసనసభ్యులు పెందుర్తి వెంకటేష్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, పెందుర్తి వెంకటేష్ ప్రజాదరణతో పార్టీలో మరిన్ని ఉన్నత పదవులు అధిరోదించాలన్నారు. వేసవి దృష్ట్యా పాదచారులకు, వాహన దారులకు చల్లటి ఆరోగ్యకరమైన మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు మింగి లక్ష్మీనారాయణ, మారిశెట్టి రమణ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, మహిళా కారాగారాల్లో

## లీగల్ ఎయిడ్ హెల్ప్ డెస్క్ ప్రారంభం

డిఎల్ఎస్ఎ కార్యదర్శి వై.శ్రీలక్ష్మి





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** శుక్రవారం తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి యార్లగడ్డ శ్రీ లక్ష్మి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం, మహిళా కారాగారాలలో లీగల్ ఎయిడ్ హెల్ప్ డెస్కును ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర కారాగారం, మహిళా కారాగారాలలో ఆహార ప్రమాణాలు, పరిశుభ్రత, ఖైదీలకు కల్పిస్తున్న ఇతర సదుపాయాలను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఖైదీల తరపున ఉచితంగా వాదించేందుకు న్యాయవాదులు కావాలన్నా, బెయిల్ పిటిషన్లు దాఖలు చేయాలన్నా, పై కోర్టుల్లో అప్పీలు వేయాలన్నా లేదా ఇతర న్యాయ సహాయం అవసరమైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా సహకారం అందిస్తామని తెలిపారు. ఇందుకోసం సంస్థ నియమించిన పారా లీగల్ వాలంటీర్ల ద్వారా తమ అర్జీలను అందించాలని సూచించారు.ముద్దాయిలు, ఖైదీలకు న్యాయ సహాయం అందించేందుకు పనిచేస్తున్న లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.


ఎమ్మెల్యే నల్లమిల్లి సారూ... మీ హయాంలో అవినీతికి

# సాక్ష్యాలు ఇవిగో.. చర్యలు తీసుకోగలరా..?

- ఆధారాలతో సహా ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అవినీతి చిట్టా విప్పిన డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి
- వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన మాజీ ఎమ్మెల్యే
- ఎమ్మెల్యే అవినీతి భాగోతాన్ని రిజిస్టర్డ్ పోస్టులో ఎమ్మెల్యే ఇంటికే పంపిన మాజీ ఎమ్మెల్యే!




**అనపర్తి, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గంలో చెరువుల మట్టి, గ్రావెల్ తవ్వకాల విషయంలో స్థానిక ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతున్నారంటూ మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి గారు తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ మేరకు ఆయన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడా లేని విధంగా అనపర్తి నియోజకవర్గంలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని, వీటన్నింటినీ ఆధారాలతో సహా తాము నిరూపించినప్పటికీ ఎమ్మెల్యేలో కనీస స్పందన లేదని విమర్శించారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తన సొంత పచ్చ పత్రికలను మాత్రమే చదువుతూ వాటినే వేదవాక్కుగా భావిస్తున్నారని, అందుకే తాము ఒక కీలక నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఎమ్మెల్యే ఏ రకంగా చెరువులలో మట్టిని అక్రమంగా తవ్వించారో దానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలను ఒక పెన్ డ్రైవ్‌లో భద్రపరిచి నేరుగా ఆయనకే పోస్ట్ చేస్తున్నట్లు వెల్లడించారు. గతంలో నిబంధనలకు విరుద్ధంగా 13 నుండి 14 అడుగుల లోతుకు మట్టిని తవ్వడం వల్లే ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అనపర్తిలోని రామచంద్రుని చెరువులో పడి ఒకరు, కాపవరం గ్రామంలోని వెదుళ్ళ చెరువులో ముగ్గురు, రంగాపురంలోని చెరువులో పడి ఇద్దరు చనిపోవడంతో పాటు అనేక పశువులు కూడా మృత్యువాత పడ్డాయని గుర్తు చేశారు. కొన్నిచోట్ల చెరువులలోని మట్టిని ముందే తవ్వి స్టాక్ పెట్టి, మార్కెట్లో మంచి రేటు వచ్చిన తర్వాత అమ్ముకున్న ఘనత ఎమ్మెల్యేదేనని దుయ్యబట్టారు. ప్రజల సొమ్మును కాపాడాల్సిన కొందరు అధికారులు కూడా ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి కోట్లాది రూపాయల లబ్ధి చేకూరేలా సహకరించడం విచారకరమన్నారు. నియోజకవర్గంలోని వడిసలేరులో పాపాయి చెరువు, సుభద్రంపేటలో పంతం వారి చెరువు, రంగాపురంలో కుడుముల చెరువు, మర్రిపూడిలో అచ్చం చెరువు, బిక్కవోలులో లింగాల చెరువు వంటి అనేక చెరువులలో మట్టిని అక్రమంగా తవ్వి దోచుకుపోతుంటే ప్రజలు చూస్తూ ఊరుకోరని డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి హెచ్చరించారు. ఈ మట్టి మాఫియాతో తనకు ఎలాంటి సంబంధం లేకపోతే, తాము ఆరోపణలు చేసినప్పుడు అధికారులను వెంటబెట్టుకుని వెళ్లి ఆ చెరువుల వద్ద నిజానిజాలను ఎందుకు నిరూపించలేకపోయారని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. తన అవినీతిని ఆధారాలతో నిరూపిస్తే ఆస్తి మొత్తాన్ని రాసిస్తానంటూ ఇటీవల ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ, ఎన్ని ఆధారాలతో నిరూపించినా అదంతా చివరకు పాపిష్టి సొమ్మేనని, ఆ పాపిష్టి సొమ్ములో ఒక్క రూపాయి కూడా తమకు వద్దని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెరువుల మట్టి మాఫియాలో చేసిన అవినీతి ఫోటోలను, ఆయనకు రాసిన లేఖను, అలాగే ఎమ్మెల్యే రికమండేషన్‌తో అధికారులు జారీ చేసిన జీవో కాపీని మీడియా ప్రతినిధులకు ప్రదర్శించారు. అధికారులు మూడు అడుగుల లోతుకు మాత్రమే అనుమతి ఇస్తే, అక్కడ ఏకంగా 12 నుండి 15 అడుగుల లోతు వరకు తవ్వకాలు జరిపించారని, దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి నిజంగానే చిత్తశుద్ధి ఉంటే తక్షణమే చర్యలు చేపట్టాలని, నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆస్తిని కాపాడాల్సిన బాధ్యత ఆయనపైనే ఉందని గుర్తు చేశారు. చట్టాన్ని రక్షించాల్సిన ప్రజాప్రతినిధే ఈ విధంగా దోపిడీకి పాల్పడితే ఇక ప్రజలను ఎవరు రక్షిస్తారని ప్రశ్నిస్తూ, ఇదంతా యదార్థమో కాదో తెలుసుకోవడానికి మీడియా మిత్రులందరూ స్వయంగా ఆయా చెరువుల దగ్గరకు వెళ్లి పరిశీలించాలని కోరారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి చేస్తున్న ప్రతి అవినీతి అక్రమాన్ని తాము నిరంతరం ఎండగడుతూనే ఉంటామని డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి^ప్స్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ళ కృష్ణారెడ్డి, అనపర్తి మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు), అనపర్తి టౌన్ అధ్యక్షులు రంగంపేట మండలం ఇంచార్జ్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, ఎంపీటీసీ కొండేటి భీమేష్, పొలమూరు మాజీ ఉప సర్పంచ్ సత్తి సూరారెడ్డి, అనపర్తి మండల విద్యా విభాగం అధ్యక్షుడు సత్తి రామారెడ్డి, అనపర్తి మండల యువజన విభాగం సత్తి మణికంఠ రెడ్డి, రంగాపురం ఉప సర్పంచ్ శ్యాంబాబు, వా. సూర్యనారాయణ రాజు, పాల్గొన్నారు.

అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్

# సేవలు చిరస్మరణీయం




**రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్**

**రామచంద్రాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ధవళేశ్వరం ఆనకట్ట నిర్మాణం ద్వారా ఉభయ గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసి లక్షలాది మంది రైతుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు సర్ ఆర్థర్ కాటన్ అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కొనియాడారు. సర్ ఆర్థర్ కాటన్ జయంతిని పురస్కరించుకుని ఆయనకు మంత్రి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గోదావరి నదీ జలాలను సమర్థంగా వినియోగించాలనే సంకల్పంతో ధవళేశ్వరం బ్యారేజ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టి, వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికిన దూరదృష్టి గల ఇంజనీర్ సర్ ఆర్థర్ కాటన్ అని పేర్కొన్నారు. ఆయన కృషి వల్లే గోదావరి పరివాహక ప్రాంతం అన్నపూర్ణగా మారి రైతుల జీవన విధానంలో అపారమైన మార్పు చోటుచేసుకుందని తెలిపారు. రైతుల కష్టాలను తన కష్టాలుగా భావించి, పంటలకు నీరందించేందుకు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ పనిచేసిన కాటన్ దొర సేవలు తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని మంత్రి సుభాష్ అన్నారు. ఆయన నిర్మించిన ఆనకట్టలు కేవలం ఇంజనీరింగ్ అద్భుతాలు మాత్రమే కాకుండా, కోట్లాది మంది రైతుల జీవితాలకు భరోసానిచ్చిన జీవనాధారాలుగా నిలిచాయని వివరించారు. రైతాంగ అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు యుగయుగాల పాటు స్మరణీయమని అన్నదాతల కోసం అహర్నిశలు శ్రమించిన సర్ ఆర్థర్ కాటన్ ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# అజాతశత్రువు బండారుకు పుట్టినరోజు శుభాకాంక్షలు : గుబ్బల మూర్తి

**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** బండారు సత్యానందరావు పుట్టినరోజు సందర్భంగా జరిగిన వేడుకలలో పాల్గొని సీనియర్ టిడిపి నాయకులు గుబ్బల మూర్తి ఆయనను ఉద్దేశించి మాట్లాడుతూ మహాభారతంలో కౌరవులకు పాండవులకు జరిగిన కురుక్షేత్ర యుద్ధంలో ధర్మరాజు ఆయుధం చేతబట్టి 18 రోజులు యుద్ధం చేశాడు. ఒక్కడిని కూడా చంపలేదు. సైనికులు సైతం ఒక్కో సైనికుడు వందల మందిని చంపారు ఈయన ఒక్కడిని కూడా సంహారించలేదు. జీవ హింస చేయడం రాదు. కానీ రాజయ్యాడు. తన ధర్మ పాలనతో కీర్తి ప్రతిష్టలు గడించాడు. యుద్ధంలో శత్రువులు ఎదురైనప్పుడు బాగున్నారా తమ్ముడు ! అని పలకరించేవాడు. ఇంత మంచి మనిషితో యుద్ధం చేయలేక దండం పెట్టి పక్కకు వెళ్లి పోయారు. ధర్మరాజు మనస్తత్వం గలిగిన సత్యానంద రావుకి వ్యక్తిగతంగా విమర్శలు చేయటం ఇష్టం ఉండదు. హాని చేయటం చేతకాదు. విమర్శలు చేయడు. వివాదాల జోలికి వెళ్ళడు. రాజకీయాలలో ఈ రెండు లేకుండా ముందుకు వెళ్లడం కష్టమే కానీ ఆచరణలో చేసి చూపించి సుదీర్ఘకాలం రాజకీయాల్లో అందరి మన్ననలను పొందుతూ అందరివాడిగా బండారు సత్యానందరావు పేరుగాంచారు. తన వివాదరయిత



స్వభావంతో శత్రువులను కూడా మెప్పించగల అజాతశత్రువు బండారు సత్యానందరావు.కొత్తపేట నియోజకవర్గంలో తన రికార్డును తానే తిరగరాస్తు రికార్డు స్థాయిలో 57000 పైబడి మెజారిటీతో సత్యానంద రావు గెలిచారు. కూటమి ప్రభంజనంలో రాష్ట్రంలో అన్నిచోట్ల మెజారిటీలు వచ్చినప్పటికీ కొత్తపేట నియోజకవర్గ పరిస్థితి వేరు బండారు వర్సెస్ చిర్ల వర్గాల మధ్య పోరు జరుగుతుంది.ప్రత్యర్థులు ఇద్దరూ కూడా బలమైన వ్యక్తులే.ఇండిపెండింగ్ గా పోటీ చేసిన 50 వేలు ఓట్లు వస్తాయి. వ్యక్తిగతంగా సొంత ఓటు బ్యాంకు కలిగిన వారు. ఇక్కడ మెజార్టీ తెచ్చుకోవడం అంటే ఆషామాషి విషయం కాదు. రాష్ట్రంలో జగనన్న సుందరవదన రోడ్లు దుస్థితిని చవి చూసాం. జగనన్న చీప్ లిక్కర్ ను సేవించాం. ప్రాణాలు కోల్పోవడం చూశాం. పేదవారు ఆకలితో అలమటించారు. అటువంటి దయనీయ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడింది. రాష్ట్రంలో డబల్ ఇంజిన్ సర్కార్ పరిపాలన దూసుకుపోతుంది. అన్న క్యాంటీన్లను తెరిచారు తెల్లారకముందే టిఫిన్ భోజన సమయానికి భోజనాలు పెట్టి పేదవాడి ఆకలి తీరుస్తున్నారు. హైవే రోడ్లు నిర్మించారు. వేకువ జామునే పెన్షన్ దారులకు పెన్షన్ అందిస్తున్నారు. రాష్ట్రంలో అభివృద్ధి ఉరకలు పెడుతోంది. కొత్తపేట నియోజకవర్గంలో అనుభవం కలిగిన బండారు సత్యానందరావు అభివృద్ధి పరుగులు పెట్టిస్తున్నారు. వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు.అటు అభివృద్ధి సంక్షేమం సమృద్ధిగా చేసుకుంటూ వెళ్తున్నారు. లోల్లలాకులకు విధులు తెచ్చారు. కోట్లాది రూపాయలతో రోడ్లు అభివృద్ధి చేశారు. ఆరోగ్య రక్షణకు ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేశారు. కోట్లాది రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ అందించి పేదవారి వైద్యానికి భరోసా కల్పించారు. అభివృద్ధిలో సంక్షేమం అందించడంలో ఆయనకి ఆయనే సాటి అని చెప్పారు. విమర్శించడానికి ప్రత్యర్థులకు దారులు దొరకటం లేదు. కొత్తపేట నియోజకవర్గంలో చరిత్ర కలిగిన నాయకుడిగా ఆయనకు మొదటి పేజీయే ఉంటుందఅనటంలో ఎటువంటి సందేహం లేదు అని ఆయన అన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే బండారు పుట్టినరోజు వేడుకలు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అన్న క్యాంటీన్లో ఉచిత అల్పాహారం భోజనం వితరణ ప్రభుత్వ ఆసుపత్రిలో చంటి పిల్లలకు ఉయ్యాల పంపిణీ బస్టాండ్ సెంటర్ వద్ద కేక్ కటింగ్ మరియు చీరలు పంపిణీ కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు 62వ పుట్టినరోజు వేడుకలు కొత్తపేట మండలంలో ఘనంగా నిర్వహించారు. కొత్తపేట మండలం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని పది గ్రామాల్లో వివిధ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యే ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థనలు చేశారు.అనంతరం కొత్తపేట కళానగర్లోని శ్రీ సిద్ధి వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత బస్టాండ్ సెంటర్ వద్ద కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించి మహిళలకు చీరలను పంపిణీ చేశారు. అలాగే ప్రజలకు ఉపశమనం కలిగించే విధంగా చలివేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలకు, రోగులకు పండ్లు మరియు బ్రెడ్ పంపిణీ చేశారు. అనంతరం చంటి పిల్లలకు ఉయ్యాలను ఆక్సిజన్ సిలిండర్ ను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకుని అన్న క్యాంటీన్లో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనాన్ని ఉచితంగా వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు మాట్లాడుతూ కొత్తపేట మండలంలోని పది గ్రామాల్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి నిరంతరం ప్రజలకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, ప్రజాసేవలో మరింత ముందుకు సాగేందుకు భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకుంటున్నామని అన్నారు.

ఎమ్మెల్యే బండారు పుట్టినరోజు సందర్భంగా

# బోడిపాలెం వద్ద చలివేంద్ర ఏర్పాటు

**పాత బస్టాండ్ సెంటర్లో పేదలకు వస్త్ర దానం**



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రియతమ నాయకుడు ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు పుట్టినరోజు సందర్భంగా కొత్తపేట బోడిపాలెం చలివేంద్ర ఏర్పాటుచేయడం జరిగింది మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కంఠంశెట్టి శ్రీనివాసరావు. బిజెపి నాయకులు పాలూరి సత్యానందం పాలూరి జయప్రకాష్. కంఠం శెట్టి శివాజీ. చోడ పిండేడి గోవిందు. సాదా శీను.కొమ్మన శివాజీ. రంబాల సుబ్బరాజు. కొత్తపేట పాత బస్టాండ్ సెంటర్లో పేదలకు వస్త్ర దానం చేస్తున్న కార్యక్రమంలో పాల్గొన్న కముజు శ్రీనివాసరావు టిడిపి సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తరతరాలు గుర్తుండే మహానుభావుడు కాటన్ దొర



**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ 223వ జయంతి సందర్భంగా ఆలమూరు మండలం చొప్పెల్ల తూర్పు డెల్టా ప్రధాన కాలువ లాకులు వద్ద గల కాటన్ దొర విగ్రహానికి సమీప గ్రామ అన్నదాతలతో కలిసి గోదావరి జలాలతో అభిషేకం చేసి, పూలమాలలు వేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిసి చైర్మన్ మెర్ల గోపాల స్వామి మాట్లాడుతూ ధవళేశ్వరం వద్ద కాటన్ బ్యారేజ్ నిర్మించక ముందు వరద ముంపులతో గోదావరి రైతులు అల్లాడి పోయేవారన్నారు. తమ పూర్వీకులు రైతుక్షేత్రాల్లో కరువు కాటకాలు అనుభవించేవారన్నారు. బ్రిటిష్ ఇంజనీర్ గా మన దేశానికి వచ్చిన కాటన్ దొర ఇక్కడ పుట్టలేదని, ఇక్కడ పెరగలేదని, ఉద్యోగం అంటూ వచి ఊర్లన్నీ తిరుతూ ఉసురుమంటున్న ఊర్లలోనివారిని చూసి అన్నము లేక అలమటిస్తున్న అభాగ్యుల ఆక్రందన విని, బీడువారిన భూములను చూసి, మట్టి వాసనను చూసి, మాణిక్యాలు పండుతాయి అనుకున్నాడని, వృథంగా సముద్ర పాలవుతున్న విలువైన జలాలను పొలాలలో పారించాలనుకుని, గుర్రమెక్కి గోదావరి ప్రాంతం అంతా కొండ కోనల్లో తిరిగి ఆర్నెలు శ్రమించి ఈ ప్రాంతమంతా సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేసి ధవళేశ్వరం వద్ద గోదావరి నదిపై ఆనకట్ట నిర్మించి అన్నదాతల పాలిట ఆపద్బాంధవుడై అపర భగీరథుడు అయ్యాడని కొనియాడారు. కూటమి నాయకుల ఆధ్వర్యంలో భారీ కేకును కట్ చేసి స్థానిక ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శేఖరకన్నా, ఐసీ అసిస్టెంట్ కే శ్రీను, ఓఎస్ బి మెహర్, ఎన్ శివ సురేష్, పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా సాగిన న్యాయవాదుల వేసవి క్రికెట్ పోటీలు



**రామచంద్రాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల వేసవి క్రీడా పోటీలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. శుక్రవారం సాయంత్రం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన ఈ పోటీల్లో జూనియర్, సీనియర్ న్యాయవాదులు రెండు జట్లుగా విడిపోయి క్రికెట్ ఆడారు. నిరంతరం కోర్టు వ్యవహారాలు న్యాయ సేవలతో బిజీగా ఉండే న్యాయవాదులకు ఈ వేసవి క్రీడలు మంచి ఆటవిడుపునిచ్చాయి. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్ న్యాయవాదులందరిలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోటిపల్లి లోవరాజుతో పాటు మాజీ అధ్యక్షులు పిల్లి మురళీమోహన్, వెంకటరమణ, పలివెల సత్యనారాయణ, వాడ్రేవు సాయిప్రసాద్ పాల్గొన్నారు. వీరితో పాటు పిల్ల పృథ్వి, వెలగల నరేందర్ రెడ్డి, కలిదిండి కిరణ్, బులుసు వెంకటేశ్వరరావు, కముజు సూర్యనారాయణ, చామకూర వీర వెంకట సత్యనారాయణ, పంపన విటల్, పాలచర్ల భరత్ బాబు, పాకలపాటి గోవిందరాజులు తదితర న్యాయవాదులు పాల్గొని పోటీలను విజయవంతం చేశారు.

# రామచంద్రాపురం నూతన ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన ఎ.సరళావతి



**రామచంద్రాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ ఆదేశాల మేరకు అమరావతి ఏపీ సెక్రటేరియట్ నుండి బదిలీపై వచ్చిన డిప్యూటీ కలెక్టర్ ఎ.సరళావతి శుక్రవారం రామచంద్రాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) మరియు సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్‌గా బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా ఆమె రామచంద్రాపురం మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా కూడా బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆమెకు పరిపాలన అధికారిణి ఎల్.ఝూన్సీ లక్ష్మీ కుమారి, కార్యాలయ సిబ్బంది, డివిజన్ పరిధిలోని తహశీల్దార్‌లు మరియు మున్సిపల్ కమిషనర్ పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె అధికారులతో మాట్లాడుతూ పరిపాలనలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తామని పేర్కొన్నారు.

కోదండ రామాలయ పునఃప్రతిష్ఠ ఆహ్వాన పత్రికను

# విడుదల చేసిన రాజ్యసభ సభ్యులు పిల్లి బోస్



**వెంకటాయపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని వెంకటాయ పాలెం గ్రామంలో వేంచేసి యున్న శ్రీ కోదండ రామాలయ పునఃప్రతిష్ఠా మహోత్సవ ఆహ్వాన శుభ పత్రికను గౌరవ రాజ్యసభ సభ్యులు శ్రీ పిల్లి సుభాష్ చంద్రబోస్ శుక్రవారం విడుదల చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరగనున్న ఈ పునఃప్రతిష్ఠా కార్యక్రమానికి భక్తులందరూ తరలిరావాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ మరియు జిల్లా యువజన విభాగం అధ్యక్షులు శ్రీ పిల్లి సూర్యప్రకాష్, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, కే.గంగవరం మండల కన్వీనర్ పెట్టా శ్రీను పాల్గొన్నారు. అలాగే దంగేరు మాజీ ఎంపీటీసీ సభ్యులు కొప్పిశెట్టి లక్ష్మణ్, రాయుడు వీర్రాజు, వాసంశెట్టి సూరిబాబు, శ్రీరామదండు మరియు శెట్టిబలిజ సంఘం కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆహ్వాన పత్రికా విడుదలలో భాగస్వాములయ్యారు. ఆలయ పునఃప్రతిష్ఠను పురస్కరించుకుని గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# అన్నాయిపేటలో ఘనంగా సర్ ఆర్థర్ కాటన్ జయంతి వేడుకలు



**రామచంద్రాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని అన్నాయిపేట గ్రామ పంచాయితీ కార్యాలయం నందు శుక్రవారం సర్ ఆర్థర్ కాటన్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాటన్ చిత్రపటానికి పూలమాలలు వేసి అపర భగీరథుడిగా ఆయన కోనసీమకు చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమానికి గ్రామ పంచాయితీ ప్రత్యేకాధికారి టి.వి.ఆర్ మాణిదీప్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారితో పాటు రామచంద్రాపురం మండల పరిషత్ ఉపాధ్యక్షులు శ్రీ సాక చంద్రశేఖర సూర్య ప్రకాష్ (బాబి), గ్రామ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ చల్లా శ్రీనివాసరావు (బుజ్జి) పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు కాకిలేటి సత్తిబాబు, బొమ్మోతుల దొరబాబు, పిల్ల సూరిబాబు, మంగ కోటేశ్వరరావు, ఆనాల పాపారావు మరియు పంచాయతీ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ ప్రాంత సాగునీటి రంగానికి కాటన్ దొర వేసిన పునాదులు నేటికీ రైతులకు ఎంతో మేలు చేస్తున్నాయని కొనియాడారు.

ఆంక్షలను చేధించి విజయవాడకు చేరిన

# సమగ్ర శిక్షా 'మహా పాదయాత్ర'

**మంత్రి లోకేష్ నివాసం ముట్టడి**



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** సమగ్ర శిక్షా ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన 'మహా పాదయాత్ర' ఉద్రిక్తతల నడుమ విజయవంతంగా ముగిసింది. ముందస్తు అనుమతి ఉన్నప్పటికీ పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా అనేక చోట్ల ఉద్యోగులను అడ్డుకుంటూ వాహనాలను నిలిపివేయడం వాట్సాప్ గ్రూపులను తనిఖీ చేయడం వంటి చర్యలకు పాల్పడ్డారు. అయినప్పటికీ వేలాది మంది ఉద్యోగులు అడ్డంకులన్నింటినీ అధిగమించి విజయవాడకు చేరుకుని ఎస్.పి.డి కార్యాలయం మరియు మంత్రి లోకేష్ నివాసాన్ని ముట్టడించి తమ నిరసనను గళమెత్తారు. కనీస వేతన శ్రేణి (మినిమం టైమ్ స్కేల్) అమలు చేయాలని హెచ్.ఆర్ పాలసీని ప్రవేశపెట్టాలని మెడికల్ లీవులతో పాటు పి.ఎఫ్ మరియు ఈ.ఎస్.ఐ సౌకర్యాలు కల్పించాలని, తమను అవుట్‌సోర్సింగ్ నుండి కాంట్రాక్ట్ విధానంలోకి మార్చాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన 22 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన రాతపూర్వక హామీలు, అలాగే పాదయాత్రలో లోకేష్ గారు ఇచ్చిన వాగ్దానాలు అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా నెరవేరకపోవడంపై ఉద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం కాలయాపన చేస్తూ తమ సమస్యలను విస్మరిస్తున్నారని వారు ఆవేదన చెందారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎన్నికల హామీలను అమలు చేయాలని లేనిపక్షంలో తమ పోరాటాన్ని రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ మహా పాదయాత్రలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి వేలాది మంది ఉద్యోగులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రికార్డులను పరిశీలించిన ఎస్పీ రాహుల్ మీనా



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబాజీపేట పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్షన్ నిమిత్తం జిల్లా ఎస్పీ రాహుల్ మీనా శుక్రవారం పరిశీలించారు. వార్షిక తనిఖీలలో భాగంగా అంబాజీపేట పోలీస్ స్టేషన్ సందర్శించారు. రికార్డులు అన్ని సంతృప్తికరంగా ఉన్నట్టు తెలిపారు. పెండింగ్ కేసులను త్వరగా సత్వర మార్గాన్ని పరిష్కరించే విధంగా చూడాలని అన్నారు. యువత ఆన్లైన్ బెట్టింగులకు, క్రికెట్ బెట్టింగ్లకు, జూదానికి దూరంగా ఉండాలని తెలిపారు. ఆన్లైన్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట డీఎస్పీ సుంకర మురళి కృష్ణ, పి.గన్నవరం సిఐ ఆర్ భీమరాజు, అంబాజీపేట ఎస్సై షేక్ సుభాని పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# చింతలూరు పంచాయతీ కార్యాలయానికి నూతన ఏసీ



**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట నియోజకవర్గ శాసనసభ్యులు బండారు సత్యానందరావు జన్మదినం సందర్భంగా ఆలమూరు మండలం చింతలూరు పంచాయతీ కార్యాలయానికి నూతన ఎయిర్ కండీషనర్‌ను ఏర్పాటు చేశారు. మార్చి నెలలో నిర్వహించిన నూకాంబికా అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా పంచాయతీ పరిధిలో జరిగిన పార్కింగ్ వేలంపాట దారులు, తీర్థ మహోత్సవాల అనంతరం అదనంగా మరో 15 రోజుల నిర్వహణకు సంబంధించి రూ.25 వేల మొత్తాన్ని పంచాయతీకి అందజేశారు. దీనికి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వైట్ల శేషుబాబు రూ.15 వేల ఆర్థిక సహకారం అందించారు. ఈ రెండు మొత్తాలు కలిపి రూ.40 వేల వ్యయంతో నూతన ఏసీని కొనుగోలు చేసి పంచాయతీ కార్యాలయంలో అమర్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఈదల సత్తిబాబు కలిసి నూతన ఏసీని స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన వసతులు కల్పించే దిశగా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్న వైసిపి నేతలు : బత్తుల



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలం గుమ్ములూరు గ్రామానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సామాజికవర్గ నాయకులు జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నట్లు రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ తెలిపారు. శుక్రవారం రాజమహేంద్రవరం లోని బత్తుల స్వగృహంలో బలరామకృష్ణ వీరికి సాదర స్వాగతం పలుకుతూ, జనసేన పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.గుమ్ములూరు గ్రామానికి చెందిన కాటే కృష్ణ ప్రసాద్, చిన్నం వెంకటరమణ, దారా వెంకటేశ్వర్లు, గొర్రెల సుబ్బారావు, కాతా పండురాజు, గుమ్మడి రవికుమార్ తదితరులను బత్తుల పార్టీలోకి ఆహ్వానిస్తూ, పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు.జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు, ప్రజలకు చేస్తున్న సేవా కార్యక్రమాల పట్ల ఆకర్షితులై జనసేన పార్టీలోకి రావడం జరిగిందని బత్తుల తెలిపారు.పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఇస్తామని,అందరం కలిసికట్టుగా పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేద్దామన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

# మెరుగైన ఉద్యోగ అవకాశాలకు నైపుణ్య శిక్షణలు కీలకం : ఎమ్మెల్యే వేగుళ్ళ



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** నైపుణ్యం, ఆధునిక శిక్షణ ద్వారా మెరుగైన అవకాశాలు అందిపుచ్చుకొని ఎదగాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు.మండపేట పట్టణం గాంధీనగర్ లోని శ్రీ లాల్ బహదూర్ మున్సిపల్ స్కూల్ లో శుక్రవారం ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ కమ్ స్కిల్ డెవలప్‌మెంట్ (ఈఎస్?డిపి) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రోగ్రామ్ రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల పెర్ఫార్మెన్స్ ర్యాంప్ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాంప్ పథకం ద్వారా సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల స్థాపన, వాటి పనితీరును మెరుగుపరచడం, వాటికి రుణ లభ్యతను పెంచడం మార్కెటింగ్ అవకాశాలను మెరుగుపరచడం వాటిని అంతర్జాతీయ పోటీకి సిద్ధం చేయడం వంటి అంశాలపై శిక్షణ ఇవ్వటం ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం అని చెప్పారు. యువత మహిళలు ఈ స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని సూచించారు. మహిళల కోసం ప్రత్యేకంగా మగ్గం వర్కు శిక్షణ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. శిక్షణ అనంతరం అందించే సర్టిఫికెట్ మహిళల అభివృద్ధికి ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షులు మెకానిక్ కరీం, టిడిపి నాయకులు పిల్లా గణపతి, అల్లక శ్రీనివాసు, కాళ్ళ ఆనంద్, కడియాల గోవిందు, వంక మణి, పట్నాల రమణ, సంకు కుమార్ నాయుడు, సంగుల దొరబాబు, అల్లాడి నందు, పోలమూరి సుబ్బారావు, గోరు ప్రభాకర్ రావు, నామాల వెంకటరమణ, పెకేటి మాణిక్యం, బత్తుల భవాని, ఆకుల ఈశ్వరరావు, లంక రవికిరణ్, పెదగాడి వీరబాబు, మున్సిపల్ అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

# గరగ నెత్తి అనపాలమ్మ జాతర ప్రారంభించిన నల్లమిల్లి



**అనపర్తి, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా, అనపర్తి మండలం కుతుకులూరు గ్రామంలో గ్రామ దేవత శ్రీ శ్రీ శ్రీ అనపాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు అనపర్తి శాసన సభ్యునల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే గరగను ఎత్తుకొని జాతర ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంతో గ్రామంలో భక్తుల సందడి నెలకొంది. ఎమ్మెల్యేకు కుతుకులూరు రెడ్డి సంఘం అధ్యక్షుడు, ఆలయ చైర్మన్ పులగం వీర వెంకట సత్యనారాయణరెడ్డి (రెడ్)తో పాటు ఆలయ కమిటీ సభ్యులు పూలమాలలు, శాలువాలతో ఘన సన్మానం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ జాతర ఉత్సవాలు ఈరోజు సంభారంతో ప్రారంభమై, రేపు నైవేద్య కార్యక్రమాలు, ఆదివారం తీర్థ మహోత్సవంతో ముగుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనపర్తి మండల కూటమి నాయకులు, కుతుకులూరు గ్రామ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

కాకినాడ
జిల్లా ఎడిషన్

శనివారం, 16 మే 2026
www.viswamvoice.com






నడకుదురు డ్వాక్రా మహిళా సంఘాలకు

# నూతన కమిటీ ఏర్పాటు

జనసేన నాయకురాలు ముమ్మిడి పుష్పలత ఆధ్వర్యంలో



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ కరప మండలం నడకుదురు గ్రామంలో మహిళ డ్వాక్రా సంఘల నూతన కమిటీ ఏర్పాటు గ్రామ జనసేన పార్టీ సీనియర్ నాయకురాలు ముమ్మిడి పుష్పలత ఆధ్వర్యంలో నల్ల మంగాదేవి అధ్యక్షతన వివోలు, ఓబిలు అధ్యక్షులు కార్యదర్శులు, కోశాధికారుల ఎన్నిక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వివో5, వివో 3 లుగా నల్ల భాగ్యశ్రీ, అనిశెట్టి పుష్పలు ఎన్నిక కాగా ఓబిల అధ్యక్షులుగా గొల్లపల్లి సత్యవేణి, భోదిరెడ్డి వరలక్ష్మి లు ఎన్నికగాక కార్యదర్శులుగా భవాని, గాజుల చక్రవేణిలు, కోశాధికారులుగా లావణ్య, గాజుల నాగమణిలు నూతనంగా ఎన్నిక కాబట్టారు. ఈ సమావేశానికి కరప మండలం పోలీస్ అధికారి ఎస్సై తోట సునీత, రూరల్ సీఐ చైతన్యకృష్ణ అతిథులుగా హాజరయ్యారు. ఈ పోలీసు అధికారులు మాట్లాడుతూ మహిళలు పై జరుగుతున్న సంఘటనల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అవగాహనతో ధైర్యంతో ముందుకు వెళ్లాలని మహిళలపై ఎటువంటి ఇబ్బంది కలిగిన తక్షణమే ఫిర్యాదు చేయాలని అన్నారు. అలాగే దొంగతనాలు జరగకుండా ఉండేందుకు మన వంతు సహకారంగా ఇండ్లు తాళాలు వేసుకునేటప్పుడు బయటకు కనబడే విధంగా ఉండకూడదు అని తెలిపారు. అలాగే ఆన్లైన్ మోసాలకు బలి కావద్దని తెలియజేశారు. ఏ ఇబ్బంది కలిగిన అనుమానం వచ్చినా వెంటనే పోలీస్ స్టేషన్ కు తెలియపరచాలని తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీ వాళ్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఆత్మ కమిటీ చైర్మన్ గొల్లపల్లి చంద్రశేఖర్, జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు బిరద భాస్కర తమ్మయ్య, కరప మండల ఎస్సీసెల్ అధ్యక్షులు మెండు గోవిందు, నాయకులు ఐరెడ్డి నాని, ఆత్మ డైరెక్టర్ గుబ్బల భవాని, పబ్బినేడి సూరిబాబు, పులిదిండి రాజు, వివిధ సంఘాల వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పోలేరమ్మ అమ్మవారి జాతర

ప్రత్యేక ఆకర్షణగా సాంస్కృతిక కార్యక్రమాలు



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాజులూరు మండలం ఆర్యవటం గ్రామంలో గ్రామ దేవత పోలేరమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ మేరకు గురు, శుక్రవారాల్లో రాత్రి పూట గ్రామ వీధుల్లో జాగారం నిర్వహించారు. ఈసందర్బంగా గరగ నృత్యలు, కోలాటం, శక్తి వేషాలతో పాటు పలు సంస్కృతిక కార్యక్రమాలు అట్టహాసంగా నిర్వహించారు. శనివారం పోలేరమ్మ అమ్మవారి తీర్థమహోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పుల్లెపు వీరవెంకట సత్యనారాయణ, పుల్లెపు దొరబాబు, పుల్లెపు నాగు, పుల్లెపు సురేష్, పుల్లెపు ఆనంద్, బూర్లు సత్యనారాయణ, చందాల నూకరాజు, యరకం నాగు, చందాల బాబీ, బొక్కా శ్రీనివాస్, పుల్లెపు శ్రీను, చందాల గోపాలవేంకటేష్, చందాల నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

గొల్లపాలెం హై స్కూల్ సమ్మర్ స్పోర్ట్స్ క్యాంప్‌కి విచ్చేసిన

# జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సతీష్

**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాజులూరు మండలం గొల్లపాలెం హై స్కూల్‌లో మే 1 నుండి జరుగుతున్న సాఫ్ట్ బాల్, వాలీబాల్, రైఫిల్ షూటింగ్ సమ్మర్ స్పోర్ట్స్ క్యాంప్ కి కాకినాడ జిల్లా ఊఊఊ సతీష్ కుమార్, సానా సతీష్ బాబు ఫౌండేషన్ చైర్మన్, తూ గో క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు తలాటం హరీష్ విచ్చేసి క్రీడాకారులను ఆశీర్వాదించారు. ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ ఆథారిటీ ద్వారా క్రీడా పరికరాలు అందజేశారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన పౌష్టిక ఆహారం పిల్లలుకి అందజేశారు. గత నెలలో ఎవరెస్టు బేస్ క్యాంప్ అధిరోహించిన గొల్లపాలెం విద్యార్థిని పితాని రూపా సాయి శ్రీ నీ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గొల్లపాలెం గ్రామ పెద్దలు డిఎస్ డిఓ సతీష్‌ని, తలాటం హరీష్‌ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు తాడి రామారెడ్డి, సొసైటీ చైర్మన్ అంగర కృష్ణ, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ ముద్రే శివ శంకర్,గ్రామ టీడీపీ అధ్యక్షులు నక్క శ్రీను, అంగర శ్రీను,టీడీపీ క్లస్టర్ ఇంచార్జి పలివెల రాజు, దీవెన వెంకన్న బాబు, అర్టోస్ చిన్న, చిన్న డాక్టర్, ధరణి, నాగార్జున, సంజయ్, పీడీలు జి.సునీల్, ఇమ్మాన్యేల్, తనోజ్, మణికంఠ పాల్గొన్నారు.

జడ్పీలో అపర భగీరథుడు

# కాటన్ దొర జయంతి వేడుకలు



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా ప్రజా పరిషత్, కాకినాడ ప్రాంగణములో "అపర భగీరథుడు" సర్ ఆర్థర్ కాటన్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రజా పరిషత్ చైర్పర్సన్ విప్పర్తి వేణుగోపాల్ రావు ముఖ్య అతిధిగా విచ్చేసి, జిల్లా పరిషత్ ఆవరణలో గల కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ విప్పర్తి వేణుగోపాల్ రావు మాట్లాడుతూ, ఆంధ్రదేశాన్ని, ముఖ్యంగా గోదావరి జిల్లాలను సుభిక్షం చేసిన మహనీయుడు సర్ ఆర్థర్ కాటన్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్, కాకినాడ ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారిణి డి.లలిత, పంచాయతిరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఎస్.ఇ వివిఎస్ శ్రీనివాస్, పి.ఆర్, పి.ఇ.యు. వి & క్యుసి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, జెడ్.పి.పి పరిపాలనాధికారులు, జెడ్.పి.పి. సిబ్బంది మరియు ఇంజినీరింగ్ సిబ్బంది అందరూ పాల్గొని పుష్పాంజలి ఘటించారు. అనంతరం సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేశారు.

# 'వన్ మంత్ - వన్ విలేజ్ - ఫోర్ విజిట్స్'

## తుని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్



**కాకినాడ జిల్లా (తుని), విశ్వం వాయిస్ న్యూస్ :** "ఒక నెల – ఒక గ్రామం – నాలుగు సందర్శనలు" కార్యక్రమంలో భాగంగా అందిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి వారం రోజుల్లో పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఒక నెల – ఒక గ్రామం – నాలుగు సందర్శనలు" కార్యక్రమం శుక్రవారం తుని నియోజకవర్గం తుని ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో తుని మండల పరిధిలోని ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్.. ప్రజల నుంచి నేరుగా అర్జీలను, దరఖాస్తులను స్వీకరించారు. పింఛన్లు, ఇళ్ల స్థలాల మంజూరు, భూ రికార్డులు ఆన్ లైన్ లో నమోదు, రీ సర్వే, పంట నష్టం, సీసీ రోడ్లు, డ్రైన్స్, మురుగు కాలువలు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై 165 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల అనుసారం జిల్లాలో "ఒక నెల – ఒక గ్రామం – నాలుగు సందర్శనలు" నేటి నుంచి ప్రారంభించడం జరిగిందన్నారు. గ్రామ స్థాయిలో ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు నేరుగా అధికారులను కలుసుకునే అవకాశం లభిస్తుందన్నారు. అదేవిధంగా ప్రజల నుంచి అందిన అర్జీలను పారదర్శకంగా, వేగంగా పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. గ్రామ స్థాయిలో సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన అర్జీలను పరిష్కరించాలని అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల్లో నమోదైన దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, తగిన పరిష్కారాలు ఇవ్వాలన్నారు. వచ్చేవారం జరిగే కార్యక్రమం నాటికి ఈ అర్జీల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తుని తహసీల్దార్ జీవీఎస్.ప్రసాద్, ఎంపీడీవో కె. మరిదయ్య, అన్ని శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలకు దరఖాస్తు చేసుకోండి

## ఆంధ్ర రైతులకు 50శాతం రాయితీపై సాగు యంత్రాలు
## మార్గదర్శకాలను విడుదల చేసిన ప్రభుత్వం - అర్హులైనవారే దరఖాస్తు చేసుకోవాలని సూచన

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈ 2026-2027 ఆర్థిక సంవత్సరానికి రైతులకు రాయితీపై సాగు పరికరాలను అందించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకు 28 జిల్లాలకు రూ.112.50 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఈ పథకంలో లబ్ధిదారుల అర్హతకు సంబంధించిన మార్గదర్శకాల ప్రభుత్వం విడుదల చేసింది. ఎస్సీ, ఎస్టీ, సన్నకారు రైతులు, మహిళలకు 50 శాతం రాయితీతో ఇస్తారు. మిగిలిన రైతులకు 40 శాతం సబ్సిడీ ఉంటుంది. అర్హులైన రైతులు ఈ సాగు యంత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందిస్తోంది. అది గాక 50 శాతం రాయితీపై యంత్రాలు, పరికరాలు అందజేస్తోంది. ఖరీఫ్, రబీ సాగు ఆధారంగా 28 జిల్లాలకు రూ.112.50 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. రైతులకు అవసరమైన ట్రాక్టర్ల, స్ప్రేయర్లు, గొర్రులు, కోత, నూర్పిడి యంత్రాలు వంటివి రాయితీపై అందిస్తారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు, మహిళలకు వ్యవసాయ యంత్రాల యూనిట్ ధరలో 50% రాయితీ ఇస్తారు. మిగిలిన రైతులకు 40% రాయితీ అందిస్తోంది. ఈ రాయితీ పథకానికి సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. రైతులకు రాయితీపై అందిస్తున్న యంత్రాల జాబితాలో ట్రాక్టర్లు, పంట కోత యంత్రాలు, విత్తనాలు నాటే యంత్రం, స్ప్రేయర్లు, ఎండుగడ్డి, మేత సామగ్రి, నూర్పిడి యంత్రాలు, కోత యంత్రాలు వంటివి అందజేస్తారు. జాయింట్ కలెక్టర్ లాటరీ ద్వారా లబ్ధిదారుల్ని ఎంపికచేసి రాయితీపై యంత్రాలు అందిస్తారు. ఆయా జిల్లా ఇంఛార్జ్ మంత్రి ఆమోదం తర్వాత లబ్ధిదారుల జాబితాను విడుదల చేస్తారు. ఈ పథకం కింద ఎంపికైన రైతుల మొబైల్‌కు మెసేజ్ వస్తుంది. అర్హుల్ని భూమి రికార్డులు, అటవీ హక్కుల పత్రాలు, ఈ-పంట వంటి వివరాల ద్వారా ఎంపిక చేస్తారు. రైతులకు ప్రభుత్వం ఇచ్చే రాయితీ పోను మిగిలిన సొమ్మును 15 రోజుల్లో డీలర్లకు చెల్లించాలి. ఆ తర్వాత 15 రోజులకు యంత్రాన్ని రైతుకు ఇస్తారు. రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారా రాయితీపై యంత్రాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. రైతులు వారికి నచ్చిన డీలర్ వద్ద పరికరాన్ని కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. ఈ రాయితీ యంత్రాల కోసం మే 5 నుంచి 19 వరకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ మే నెల 23 నుంచి 25 వరకు లాటరీ ద్వారా రైతుల్ని ఎంపిక చేస్తారు. మే 26 నుంచి జూన్ 9 లోగా రైతులు తమ వాటా డబ్బుల్ని డీలర్‌కు చెల్లించాలి. అనంతరం మే 26 నుంచి జూన్ 26 వరకు యంత్రాలు రైతులకు అందజేస్తారు. జూన్ 30 నుంచి డీలర్‌కు రాయితీ డబ్బులు విడుదల చేస్తారు. రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు వెబ్‌సైట్ https://eseed.ap.gov.in/FM/ను సందర్శించాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ పథకానికి కౌలు రైతులూ అర్హులేనని అధికారులు తెలిపారు. కౌలు రైతుల్లో కూడా గత మూడేళ్లలో కనీసం మూడు సీజన్లలో ఈ-పంటలో నమోదైన వారు మాత్రమే ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఆర్ఓఎఫ్ఆర్ (అటవీ హక్కుల పత్రాలు) ఉన్న రైతులు కూడా ఈ పథకానికి అర్హులు. రైతుల్లో కొంత మంది 2024-25లో రాయితీ పొందారు. వారు ఈ పథకానికి అనర్హులు. అలాగే రైతు కుటుంబంలో ఒక్కరు మాత్రమే ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలంలోని రైతులు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పడాల గాంధీ రైతులకు సూచించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సాయంత్రం ఒక మీడియా ప్రకటన విడుదల చేశారు. ట్రాక్టర్, పవర్ టిల్లర్, నూర్పిడి యంత్రం, రోటోవేటర్, మినీ మిల్లులు, వివిధ రకాల స్ప్రేయర్లు, గడ్డి కోసే యంత్రాలు, ట్రాక్టర్ దుక్కి పనిముట్లు వంటి వాటి కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించి ఈ నెల 19 తేదీ లోపు తమ దరఖాస్తులు అందజేయాలని ఆయన సూచించారు.




# "అర్హులైన చిన్నారులు అందర్నీ ప్రభుత్వ బడుల్లోనే చేర్చాలి"


## జిల్లా విద్యాశాఖ అధికారి పిల్లి రమేష్ - ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పన - ఉచిత కిట్లు, మధ్యాహ్న భోజనంపై అవగాహన



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విద్యా హక్కు చట్టం ప్రకారం అర్హులైన చిన్నారులు అందరికీ ప్రభుత్వ నిర్బంధ ఉచిత విద్య విధిగా అందాలి. బడి ఈడు పిల్లలు అందరూ ఖచ్చితంగా బడిలోనే ఉండాలి. ఏ విద్యార్థీ కూడా ఏ కారణం చేతనైనా మధ్యలో బడి మానేయకూడదు. నూరు శాతం అక్షరాస్యత సాధించాలి అనే ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అర్హులైన చిన్నారులు అందర్నీ ప్రభుత్వ బడుల్లోనే విధిగా చేర్చాలని కాకినాడ జిల్లా విద్యాశాఖ అధికారి (డిఇఓ) పిల్లి రమేష్ పిలుపును ఇచ్చారు. జిల్లాలో జరుగుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ప్రత్యేక కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న ఎలిమెంటరీ స్కూల్స్ ఎన్ రోల్ మెంట్ స్పెషల్ డ్రైవ్ పరిశీలనలో భాగంగా జిల్లాలోని ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం, జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామాల్లో ఆయన శుక్రవారం పర్యటించారు. ఇందులో భాగంగా శంఖవరాన్ని ఆకస్మికంగా సందర్శించారు. శంఖవరం మండలం ఎన్రోల్మెంట్ డ్రైవ్ 1, 6 తరగతుల విద్యార్థుల నమోదు, బడి మధ్యలో మానేసిన విద్యార్థుల వివరాలను ఆరా తీశారు. శంఖవరం మండలం మొత్తం మీద ప్రాథమిక విద్యకు సంబంధించి ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి తరగతిలో 376 మంది చిన్నారులను చేర్పించుకోడం లక్ష్యం కాగా వారిలో ఇప్పటికి 172 మందిని ఈ వేసవి ప్రత్యేక నమోదు కార్యక్రమంలో చేర్పించామని డిఇఓకు మండల విద్యాశాఖ అధికారి 2 తామాడ గోవింద్ వివరించారు. దీనికి డిఇఓ ప్రతిస్పందిస్తూ... మిగిలిన వారిని కూడా వీలైనంత త్వరగా నమోదు చేయించ వలసినదిగా ఆదేశించారు. శంఖవరం మండలం మొత్తానికి ఇప్పటికే ప్రభుత్వం సరఫరా చేసిన 18,598 అచ్చు, నోటు పుస్తకాలను నిల్వ ఉంచిన స్థానిక జిల్లా ప్రజా పరిషత్తు ఉన్నత పాఠశాలలోని పుస్తకాల నిల్వ కేంద్రాన్ని సందర్శించిన డిఇఓ అక్కడి సంరక్షణ పరిస్థితులను పరిశీలించారు. అలాగే జగపతి నగరంలో డిఇఓ రమేష్ ఆధ్వర్యంలో జరిగిన డ్రైవ్ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపుపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్యాబోధన జరుగుతోందని, వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మంచి ఫలితాలను సాధిస్తూ ఉన్నారని పేర్కొన్నారు. అలాగే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకం ద్వారా మూడు జతల యూనిఫామ్‌లు, స్కూల్ బ్యాగ్, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, ఒక బెల్టు, అచ్చు పుస్తకాలు, రాత పుస్తకాలు తదితర వస్తువులతో కూడిన కిట్లు ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాలను వినియోగించుకొని పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లి, దండ్రులను కోరారు. ఈ నమోదు ప్రత్యేక కార్యక్రమంలో 1 నుంచి 8వ తరగతి వరకు మొత్తం 10 మంది విద్యార్థులను వివిధ పాఠశాలల్లో చేర్పించారు. ఈ రెండు గ్రామాల కార్యక్రమాల్లోనూ డిసిసిబి. సెక్రటరీ వెంకటరావు, శంఖవరం స్కూల్ కాంప్లెక్స్ హెచ్.ఎం.బి. జగ్గారావు, ఎం.ఐ.ఎస్ కోఆర్డినేటర్ కసిరెడ్డి నాగరాజు, కిర్లంపూడి మండలం ఎంఈఓ1 టి.జోసెఫ్, ఎంఈఓ 2 ఎం. చిన్నారావు, క్లస్టర్ స్కూల్స్ ప్రధానోపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిఆర్పీలు, పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్లు, మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు గుడాల రాంబాబు, చదరం చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ పోలీసింగ్ దిశగా మరో ముందడుగు - ప్రత్యేక శిక్షణ కార్యక్రమం

**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఆదేశాల మేరకు పోలీసు శాఖలో సాంకేతిక సేవల వినియోగాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ఈరోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతి పోలీస్ స్టేషన్ నుండి ముగ్గురు సిబ్బందిని మరియు ఆర్మ్డ్ రిజర్వ్ సిబ్బందితో సుమారు 120 మందికి స్మార్ట్ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ మరియు ఇతర ఆన్‌లైన్ సేవలు, డిజిటల్ విధానాలపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ వి.వి.సత్యనారాయణ, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ దుర్గా శేఖర్ రెడ్డి పాల్గొని సిబ్బందికి కీలక సూచనలు అందించారు.



జేఎన్టీయూకేలో

# కాటన్ జయంతి వేడుకలు




**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ (ఇండియా) కాకినాడ లోకల్ సెంటర్ మరియు రిటైర్డ్ ఇరిగేషన్ ఇంజినీర్స్ అసోసియేషన్, కాకినాడ సంయుక్త ఆధ్వర్యంలో సర్ ఆర్థర్ థామస్ కాటన్ 223వ జయంతి వేడుకలు శుక్రవారం ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ (ఇండియా) కాకినాడ లోకల్ చాప్టర్ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొ.సి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ హాజరయ్యారు. గౌరవ అతిథులుగా గోదావరి డెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజినీర్ పి.చిన్నబాబు, యూసీఈకే ప్రిన్సిపాల్ ప్రొ.కె. పద్మరాజు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఐఈ కాకినాడ లోకల్ సెంటర్ చైర్మన్ డా.వి.జయప్రసాద్ సమన్వయం చేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొ.సి. ఎస్. ఆర్.కె. ప్రసాద్ మాట్లాడుతూ, సర్ ఆర్థర్ కాటన్ గోదావరి డెల్టా అభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. వ్యవసాయాభివృద్ధి, సాగునీటి సదుపాయాల విస్తరణలో ఆయన చూపిన దూరదృష్టి నేటి ఇంజినీర్లకు ఆదర్శమని అన్నారు. యువ ఇంజినీర్లు సమాజాభివృద్ధికి తోడ్పడే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రకృతి వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ సుస్థిర అభివృద్ధి దిశగా ఇంజినీర్లు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.అతిథి పి.చిన్నబాబు మాట్లాడుతూ, సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన ఆనకట్టలు, కాలువ వ్యవస్థలు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగానికి వరప్రసాదమని తెలిపారు. ప్రొ.కె.పద్మరాజు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు సర్ ఆర్థర్ కాటన్ జీవితం నుండి సేవాభావం, కర్తవ్యనిష్ఠను నేర్చుకోవాలని సూచించారు. సాంకేతిక విద్యను సమాజ ప్రయోజనాలకు అన్వయించడమే నిజమైన ఇంజినీరింగ్ లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు పరిశోధనల పట్ల ఆసక్తి పెంపొందించుకొని దేశాభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నూతన సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఇంజినీర్లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మీరు వినే వరకు చెప్తూనే ఉంటాం..

## జిల్లా పోలీసుల వినూత్న అవగాహన కార్యక్రమాలు



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ వారి ఆదేశాలు మేరకు ఈరోజు జిల్లా వ్యాప్తంగా ట్రాఫిక్ నిబంధనలపై విస్తృత అవగాహన సదస్సులు, ఫుట్పాతుల అక్రమణదారులకు ప్రత్యేక కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. రహదారి భద్రతలో భాగంగా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, అలాగే పాదచారుల హక్కులకు భంగం కలిగిస్తూ ఫుట్పాత్‌లను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. వాహనదారులు, వ్యాపారులలో మార్పు వచ్చేంత వరకు ఈ ప్రచారాన్ని నిరంతరం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. వీటితో పాటు సమాజంలో పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు. మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, ఏ చిన్న సమస్య ఉన్నా తక్షణమే పోలీసులను ఆశ్రయించాలని లేదా శక్తి యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా ప్రజల్లో చైతన్యం నింపారు. కొంతమంది వాహనదారులు అక్కడికక్కడే హెల్మెట్లను కొనుగోలు చేసి ధరించారు. జరిమానా సొమ్ముతో హెల్మెట్ కొనుక్కునేందుకు అవకాశం కల్పించిన కాకినాడ జిల్లా పోలీసుల వినూత్న పంథాను నగరవాసులు కొనియాడారు.

# పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని సిపిఎం ధర్నా

## కెజి బేసిన్ ఉత్పత్తిలో సగం రాష్ట్రానికి కేటాయించాలని డిమాండ్




**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని సిపిఎం కాకినాడ నగర కమిటీ ఆధ్వర్యంలో కాకినాడ సివిల్ సప్లయిస్ పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దువ్వ శేష బాబ్జి మాట్లాడుతూ అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగాయని చెబుతున్న కేంద్ర పాలకులు అంతర్జాతీయంగా ధరలు తగ్గినప్పుడు కూడా పెట్రోల్ డీజిల్ ధరలు ఎందుకు పెంచారని ప్రశ్నించారు. రష్యా నుండి చౌకగా ఆయిల్ దిగుమతి అవుతున్న అమెరికా బెదిరింపులకు లొంగిపోయి ఆయిల్ దిగుమతులు నిలిపి వేయడం దారుణమన్నారు. ఇరాన్ హోర్మోజ్ జలసంధిని మూసివేయడం వల్ల సరఫరాలో కొరత ఏర్పడిందంటున్న మోడీ ఇరాన్పై అమెరికా, ఇజ్రాయెల్ దాడిని ఖండించకపోవడం దేశ ప్రతిష్టను దిగజారుస్తుందన్నారు. అంబేద్కర్ ఉద్యమ సీనియర్ నేత అయితాబత్తుల రామేశ్వరరావు మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరగడం వల్ల వాటికి అనుబంధంగా ఉన్న సరుకుల ధరలు పెరిగి సామాన్యులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రాన్స్ పోర్ట్ యూనియన్ నాయకులు వాలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో స్త్రీ శక్తి పథకం వల్ల ట్రాన్స్ పోర్ట్ డ్రైవర్స్ చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. తాజాగా పెంచిన పెట్రోల్, డీజిల్ ధరల వల్ల వాహనాలు నడపలేక, చార్జీలు పెంచలేక మరిన్ని ఇబ్బందులు పడతామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ట్రాన్స్ పోర్ట్ రంగ కార్మికులను ఆదుకోవాలన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు చెక్కల రాజ్ కుమార్ మాట్లాడుతూ కెజి బేసిన్ ఉత్పత్తిలో మన రాష్ట్రానికి సగం వాటా ఇవ్వాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు. కేంద్ర పాలకులపై మన రాష్ట్ర నేతలు వత్తిడి చేసి, ధరలు తగ్గడానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబుతో పాటు మలక వెంకటరమణ, నాగాబత్తుల సూర్య నారాయణ, మేడిశెట్టి వెంకటరమణ, సిహెచ్ విజయ్ కుమార్, ఆర్ తలుపులమ్మ, టి రాణి, ఎం హరనాథ్, సత్యవతి తదితరులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం ఆర్.డి.ఓ. కార్యాలయం ఎట చైనులుకి వినతి పత్రం సమర్పించారు.





**వృద్ధులకు తప్పని పాట్లు..**

**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పట్టణం ఆలమూరు రోడ్డు లో గల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రభుత్వ ఆసుపత్రి నందు సెల్ ఫోన్ లో ఓటిపి చెప్పి ఆన్లైన్ నమోదు చేసుకుంటూనే వైద్యం. సెల్ ఫోన్ లేకపోతే ఇవ్వని ఓపి కార్డులు. మండపేట పట్టణంలో ప్రధాన ఆసుపత్రి ఇదే కావటంతో అనారోగ్యానికి గురైన ఎందరో రోగులు పరిసర ప్రాంతాల నుండి వైద్య సేవల కోసం తరలి వస్తుంటారు. ఐతే వారు వన్ టైం పాస్వర్డ్ (ఓటీపీ) చెప్పలేక నిరుత్సాహంతో హాస్పిటల్ నుండి వెనుతిరుగుతున్నారు. 60సంవత్సరాలు పైబడిన వృద్ధులు ఈ సెల్ ఫోన్లు ఓటీపీ లు తమకు తెలియదు అని ఆధార్ కార్డు తీసుకుని వెళ్లి వైద్యం చేయించుకోవటమే తెలుసునని ఇప్పుడు ఇలాంటివి పెట్టడం వల్ల తాము ఓటీపీ లు చెప్పలేక తీవ్ర ఇబ్బందులకు గురవతున్నట్లు, తమకు ఈ ఓటీపీ నుండి వెసులుబాటు కల్పించాలని వారు తీవ్ర ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. దీనిపై ఓపి కార్డు ఇచ్చే కౌంటర్లో వారిని వివరణ కోరగా నమోదు ప్రక్రియ ఆన్లైన్ అవ్వనిదే ఓపి ఇవ్వద్దు అని తనకు ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రులలో వైద్యం చేయించుకోవడానికి తమకు ఆర్థిక స్తోమత లేక ఇక్కడికి వస్తుంటే ఆన్లైన్ ప్రక్రియతో తమకు ఇబ్బందులు కల్గిస్తున్నారని రోగులు అసహనం వ్యక్తపరిచారు. రోగుల ఆన్లైన్ ప్రక్రియ లెక్కింపు కోసమా లేక టార్గెట్ల కోసమా? అని పలువురు ఆక్షేపిస్తున్నారు. ఓటిపి లేకపోతే వైద్యం ఎట్టి పరిస్థితులలోను చేయమని చెప్పడం పట్ల రోగులంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయుష్మాన్ భారత్ యాప్ లో రోగుల పేర్లు నమోదు చేసుకుంటే పేషెంట్ భవిష్యత్తులో ఏ ఆసుపత్రిలో వైద్యానికి వెళ్ళినా ఆ పేషెంట్ ఆరోగ్య స్థితిగతులు వివరాలు ఆ యాప్ లో నమోదై ఉంటాయి అనే ఈ మంచి ఉద్దేశ్యాన్ని ఓటిపి తో ముడి పెట్టకుండా ఆధార్ నెంబరుతో సులభతరం చేయగలిగితే రోగికి వైద్య సేవలు అందించాలనే ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశ్యం నెరవేరుతుందని మహిళలు చెబుతున్నారు. ప్రజల కోసం ఏర్పాటుచేసిన ప్రభుత్వ వైద్యశాలల్లోని తీసుకొస్తున్న ఈ కొత్త విధానాలు, వైద్యసిబ్బంది తీరు పట్ల వృద్ధులు పేద ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

# పేద, మధ్యతరగతి కుటుంబాలపై ధరల అధిక భారం

**నిత్యావసర ధరల పెరుగుదలపై ప్రభుత్వ నిర్లక్ష్యం – పీడీఎస్‌యు ఆగ్రహం**
**వంటనూనె, గ్యాస్ ధరలు తగ్గించాలి – ధరల నియంత్రణ లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు**
**"సూపర్ సిక్స్" హామీలు ఎక్కడ? ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు, ముఖ్యంగా వంటనూనె ధరలు రోజురోజుకూ విపరీతంగా పెరుగుతున్నప్పటికీ కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని పీడీఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. కిరణ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "పొదుపు" పేరుతో ప్రజల జేబులు ఖాళీ చేస్తూ, "మోదీ చెప్పారు" అంటూ ధరల పెరుగుదలకు సమర్థనలు చెప్పడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. ఎన్నికల సమయంలో "పూర్ టు రిచ్", "సూపర్ సిక్స్" వంటి హామీలతో ప్రజలను ఆకర్షించిన ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత సామాన్య ప్రజల సమస్యలను పూర్తిగా గాలికొదిలేసిందన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో వంటనూనె, పప్పులు, కూరగాయలు, గ్యాస్ ధరలు పెరగడంతో మధ్యతరగతి మరియు పేద కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఇరాక్ – ఇరాన్ – అమెరికా యుద్ధ వాతావరణం పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరల పెరుగుదలకు సాకులు చెబుతూ ప్రజలపై అదనపు భారం మోపుతున్నాయని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న ధరల నియంత్రణ చర్యలు, రాయితీలు ఆంధ్రప్రదేశ్‌లో లేకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. అత్యవసర వస్తువుల ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం వెంటనే ప్రత్యేక చర్యలు చేపట్టాలని, వంటనూనె మరియు ఇతర నిత్యావసర వస్తువులపై సబ్సిడీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజా సంఘాలు, విద్యార్థి ఉద్యమ శక్తులు, సామాన్య ప్రజలను కలుపుకుని రాష్ట్రవ్యాప్తంగా దశలవారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ప్రజల కష్టాలపై రాజకీయాలు చేయడం మానుకుని, వెంటనే ధరలను నియంత్రించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని ఎస్.కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు.

# డివిఎంసీ సభ్యులుగా పెంటగట్ల మణికుమార్



**రాజానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ నాన్ ఎస్సీ సభ్యులుగా సామాజిక సేవకుడు పవన్ కళ్యాణ్ ఛారటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ పెంటగట్ల మణికుమార్ నియమితులయ్యారు. ఈమేరకు జిల్లా కలెక్టర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. వీరు రెండు ఏళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పెంటగట్ల మణికుమార్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాలు /షెడ్యూల్డ్ తెగలు (అత్యాచారాల నివారణ) చట్టం, 1989 అమలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. బాధితులకు అందించే ఉపశమన మరియు పునరావాస సౌకర్యాలు, చట్టం కింద నమోదైన కేసుల న్యాయ విచారణ (ప్రాసిక్యూషన్) పురోగతి పై కమిటీలో చర్చిస్తామన్నారు. చట్టంలోని నిబంధనలను అమలు చేయడానికి బాధ్యత వహించే వివిధ అధికారుల పాత్రను మరియు సంబంధిత అధికారుల నుండి అందిన వివిధ నివేదికలను జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగే సమావేశంలో సమీక్షిస్తారన్నారు. ఈసందర్భంగా స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు, పలువురు న్యాయవాదులు, ప్రభుత్వ అధికారులు మణికుమర్‌ని అభినందించారు.

# గోదావరి పుష్కరాలకు శాస్త్రీయ విధానంలో టెంట్ సిటీలు

**ప్రయాగ కుంభమేళ వెండర్ బృందంతో సమావేశం - వర్షాకాల పరిస్థితులకు అనుగుణంగా సమగ్ర కార్యాచరణ : కలెక్టర్ కీర్తి చేకూరి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పుష్కర భక్తుల కోసం ఆధునిక జర్మన్ టెంట్లు ప్రయాగ కుంభమేళా అనుభవాలతో మౌలిక వసతుల ప్రణాళిక , వాటికి అనుబంధంగా పుణ్య స్నాన యాత్రికులకు సురక్షిత వసతి తో పాటు డ్రైనేజ్, పారిశుధ్యం, భద్రతపై సమగ్ర నివేదిక అందచేయాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి కోరారు. గురువారం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం కొవ్వూరు డివిజన్ పరిధిలో 16 ప్రాంతాలను క్షేత్ర స్థాయిలో పరిశీలనా చేసిన ప్రయాగ కుంభమేళా టెంట్ హౌస్ వెండర్స్ బృంద సభ్యులు అనంతరం బొమ్మూరు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధ్యక్షతన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ , రానున్న 2027 గోదావరి పుష్కరాల సందర్భంగా భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వసతి సదుపాయాలు కల్పించేందుకు శాస్త్రీయ విధానంలో టెంట్ సిటీల ఏర్పాటు కోసం సమగ్ర కార్యాచరణ రూపొందిస్తున్నామని , అందుకు అనుసరించి ప్రతిపాదనలు సిద్ధం చెయ్యాలనీ పేర్కొన్నారు. జూన్–జూలై నెలల్లో వర్షాలు, గోదావరి పరివాహక ప్రాంత భౌగోళిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అన్ని ఏర్పాట్లు ముందస్తు ప్రణాళికతో చేపట్టాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో కుంభమేళా నిర్వహణలో అనుభవం కలిగిన ప్రయాగ బృంద సభ్యులు రాజమహేంద్రవరం, కొవ్వూరు పట్టణాల పరిధిలో జిల్లా యంత్రాంగం ప్రాథమికంగా గుర్తించిన 16 ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం వలన ప్రాథమికంగా ఒక అంచనాకి వచ్చి ఉంటారన్నారు. టెంట్ల ఏర్పాటుకు అనుకూలత, రవాణా సౌకర్యం, భద్రత, తాగునీరు, పారిశుధ్యం, అత్యవసర సేవల అందుబాటు వంటి అంశాలపై సమగ్ర అంచనా వేశామని వెండర్ బృందం కలెక్టర్ కు వివరించడం జరిగింది. పుష్కరాలకు వచ్చే లక్షలాది మంది భక్తులు పుణ్య స్నానాల అనంతరం తాత్కాలిక స్వల్ప విరామం తీసుకునే విధంగా ఆధునిక జర్మన్ టెంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించా మన్నారు. టెంట్ల వద్ద తాత్కాలిక మరుగుదొడ్లు, స్నానాల గదులు, తాగునీటి సదుపాయం, విద్యుత్ సరఫరా, పారిశుధ్య నిర్వహణ వంటి అన్ని మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా కల్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేకించి జూన్, జూలై నెలల్లో అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున టెంట్ల ప్రాంతాల్లో నీరు నిల్వ కాకుండా సమర్థవంతమైన డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, డ్రై అవుట్ ప్లాన్ ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు. గోదావరి నది తీర ప్రాంతాల భౌగోళిక స్వభావాన్ని పరిగణనలోకి తీసుకుని నేల మట్టం, వరద నీటి ప్రవాహ దిశ, అత్యవసర నిష్క్రమణ మార్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. టెంట్లు పూర్తిస్థాయిలో రైన్ ప్రూఫ్‌గా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ భద్రతా ప్రమాణాలు పాటించాలని, మురుగు నీటి నిర్వహణ కోసం అవసరమైన సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. భక్తుల ఆరోగ్యం, పరిశుభ్రత దృష్ట్యా పారిశుధ్య నిర్వహణను నిరంతర ప్రక్రియగా అమలు చేయాలని తెలిపారు. వీఐపీ టెంట్లు, సాధారణ భక్తుల వసతి, అధికారుల కోసం ప్రత్యేక టెంట్లు, పోలీస్ స్టేషన్లు, కంట్రోల్ రూములు, వైద్య శిబిరాలు వంటి విభాగాలను విడివిడిగా ప్రణాళికా బద్ధంగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. భక్తుల రాకపోకలు సజావుగా కొనసాగేలా రూట్ మ్యాప్ ఆధారంగా ట్రాఫిక్ మరియు భద్రతా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రయాగ కుంభమేళా సమయంలో ఎదురైన సవాళ్లు, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తీసుకున్న చర్యలను ఈ సందర్భంగా వెండర్స్ బృందం కలెక్టర్ కి వివరించింది. భారీ జనసందోహం, వర్షపాతం, పారిశుధ్య నిర్వహణ, అత్యవసర సేవల సమన్వయం వంటి అంశాల్లో అనుసరించిన విధానాలను గోదావరి పుష్కరాల్లో కూడా అమలు చేసే అవకాశాలపై చర్చించారు. పనులు సమయానికి పూర్తిచేయాలంటే కనీసం రెండు నుంచి మూడు నెలల ముందుగానే గుర్తించిన స్థలాలను సంబంధిత సంస్థలకు అప్పగించాలని వెండర్స్ బృందం సూచించింది. దీనిపై జిల్లా యంత్రాంగం సానుకూలంగా స్పందించి, అవసరమైన సమన్వయం మరియు డేటా పూర్తి స్థాయిలో అందజేస్తామని తెలిపింది. పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సురక్షితమైన, పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన వసతి కల్పించడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు.

**పుష్కరాల ఏర్పాట్లకు అనుకూల స్థలాలపై వెండర్స్ బృందం క్షేత్రస్థాయి పరిశీలన**

గోదావరి పుష్కరాల సందర్భంగా యాత్రికులకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, తాత్కాలిక ఏర్పాట్ల కోసం వెండర్స్ బృందం పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించింది. ఇందులో భాగంగా రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో ధవళేశ్వరం, బొమ్మూరు, నాల్గవ వంతెన పరిసర ప్రాంతాలు,మహానాడు ప్రాంగణం , దివాన్ చెరువు వద్ద ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సమీపంలోని స్థలాలు, బొమ్మూరు లోని నిర్మిత కేంద్రం, దేవదాయ శాఖ సైట్, హౌసింగ్ సైట్, కొవ్వూరు డివిజన్ ప్రాంతంలోని కొవ్వూరు వాటర్ వర్క్స్ స్థలాలు, ఎస్పీఐసీ లే అవుట్, రైల్వే స్థలం, బాలాజీ టౌన్‌షిప్, తదితర ప్రాంతాలను పరిశీలించారు. పుష్కరాల సమయంలో భక్తులకు పార్కింగ్, వసతి, తాగునీరు, పారిశుధ్య సదుపాయాలు కల్పించేందుకు అనుకూలంగా ఉన్న ప్రదేశాలపై అధికారులు సమగ్రంగా అధ్యయనం నిర్వహించారు. ఈ సమావేశంలో టూరిజం ఆర్.డి. ఎన్‌వివిఎస్.మూర్తి, లల్లోజి బ్రదర్స్ కంపెనీ ప్రతినిధి వినాయక్ అగర్వాల్, జీకేఎస్ ప్రాజెక్ట్ అండ్ ఈవెంట్స్ ప్రతినిధి అభిషేక్ సింగాల్, లల్లోజీ అండ్ సన్స్ ప్రతినిధి సిద్ధార్థ్ వ్యాస్, జిల్లా టూరిజం అధికారి పి.వెంకట చలం, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పెందుర్తి వెంకటేష్ జన్మదిన వేడుకలు

**ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసిన టిడిపి శ్రేణులు**



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త, కేబినెట్ హోదా పెందుర్తి వెంకటేష్ జన్మదిన వేడుకలను సీతానగరంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధులకు, చిన్నారులకు వారు పండ్లను పంపిణీ చేశారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న పెందుర్తి వెంకటేష్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని టిడిపి నాయకులు ఆకాంక్షించారు. సేవా కార్యక్రమాల ద్వారా ఆయన పుట్టినరోజును జరుపుకోవడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు.

**గోదావరి ప్రాంతాన్ని ధాన్యాగారంగా మార్చిన**

# ఘనుడు సర్ ఆర్థర్ కాటన్ : ఎమ్మెల్యే వేగుళ్ళ



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** గోదావరి జిల్లాలో లక్షలాది ఎకరాలను సస్యశ్యామలం చేసి గోదావరి జిల్లాలు దేశానికే అన్నపూర్ణగా పేరుతెచ్చిన ఘనత సర్ ఆర్థర్ కాటన్ కే దక్కుతుందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. సర్ ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా శుక్రవారం మండపేట తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో కాటన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మాట్లాడుతూ అతివృష్టి, అనావృష్టి తో అతలాకుతలమవుతున్న గోదావరి ప్రాంతాన్ని ధాన్యాగారంగా మార్చిన ఘనుడు కాటన్ అని అన్నారు. లక్షలాది ఎకరాలకు సాగునీరు, వందలాది గ్రామాలకు తాగునీరు అందించి గోదావరి వాసుల మదిలో అజరామరంగా నిలిచిపోయారన్నారు. ఆరోజుల్లో ఆయన చేతి కర్రతో గీచిన గీతలు డెల్టా కాలువలయ్యాయి అన్నారు. ధవళేశ్వరం ఆనకట్ట నిర్మించి గోదావరి జిల్లాలకు పునర్జీవం ప్రసాదించిన అపర భగీరథుడు గా కాటన్ చరిత్రలో నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, రాష్ట్ర టి.ఎన్.టి.యు.సి అధికార ప్రతినిధి వాదా ప్రసాదరావు, మండపేట మండల టీడీపీ అధ్యక్షులు కర్రి తాతరావు, ఎంపిపి ఉండమట్ల వాసు, పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, మల్లిపూడి గణేశ్వరరావు, కాశిన కాశీ విశ్వనాథం, కంటిపూడి శ్రీను, సాధనాల చక్రపాణి, మైనార్టీ సెల్ అధ్యక్షులు మెకానిక్ కరీం, పిల్లా గణపతి, పుచ్చకాయల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కాటన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన రైతులు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** గోదావరి జిల్లాల సస్యశ్యామలానికి కారకుడైన ధవళేశ్వరం ఆనకట్ట నిర్మాత సర్ ఆర్థర్ కాటన్ 223వ జయంతి మండపేట రావులపేటలో శుక్రవారం నిర్వహించారు. రైతుల సమక్షంలో రైతు నాయకులు రావూరి బాబూరావు ఆధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి సీనియర్ నాయకులు కోన సత్యనారాయణ, రైతు బిడ్డ రెడ్డి పుల్లాజీ పాల్గొన్నారు. కాటన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గొడవర్తి రామచంద్రరావు, రైతు సంఘం నాయకులు నిమ్మలపూడిగనిబాబు,రావూరి నాగయ్య, జగతా వెంకట్రావు, కమ్మిల బాబూరావు, దేవళ్లవాసు రైతులు పాల్గొన్నారు.

# పెందుర్తి వెంకటేష్ జన్మదిన వేడుకలో ఖండవల్లి పలు సేవలు


**కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన రాజానగరం ఎస్సీ సెల్ కార్యదర్శి ఖండవల్లి లక్ష్మి**





**దివాన్ చెరువు, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం మాజీ ఎమ్మెల్యే, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం దివాన్ చెరువు ఆమె నివాసంలో తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి డాక్టర్ ఖండవల్లి లక్ష్మి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వితంతువులకు చీరలు పంపిణీ చేశారు. 200 మంది సండే స్కూల్ చిన్నారులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఖండవల్లి లక్ష్మి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ రాజానగరం నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. తన రాజకీయ గురువుగా తాను ఉన్నత స్థాయి చేరుకోవడానికి సహకరించారని కొనియాడారు. పెందుర్తి వెంకటేష్ ఆయురారోగ్యాలతో,సుఖ సంతోషాలతో కలకాలం వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** రాయవరం 33/11 కెవి సబ్‌స్టేషన్‌లో వార్షిక మరమ్మతు పనుల నేపథ్యంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మల్లిక శుక్రవారం తెలిపారు. ఈ మేరకు రాయవరం, వెదురుపాక, వెదురుపాక సావరం, కొమరిపాలెం, తొస్సిపూడి, మహేంద్రవాడ గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడనుంది. విద్యుత్ వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి శాఖ అధికారులకు సహకరించాలని మల్లిక విజ్ఞప్తి చేశారు.





# చూసుకోవాలి కదమ్మా..!

## స్పిరిట్ నుంచి ప్రభాస్ లుక్ లీక్.. అసలు మ్యాటర్ ఇదే..

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా క్రేజీ కాంబినేషన్ లో తెరకెక్కుతోన్న చిత్రం స్పిరిట్. ఈ ప్రాజెక్ట్ అప్‌డేట్స్ కోసం ప్రభాస్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన ప్రీ లుక్ పోస్టర్ అందరిని ఆకట్టుకుంది. రెబల్ స్టార్ ప్రభాస్ సినిమాల కోసం ఆయన అభిమానులు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. చివరిగా ప్రభాస్ రాజా సాబ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. మారుతి దర్శకత్వంలో విడుదలైన ఈ సినిమా ప్రేక్షకులను దారుణంగా నిరాశపరిచింది. హారర్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా పై రెబల్ స్టార్ అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. కానీ సినిమా విడుదల తర్వాత అభిమానుల అంచనాలను అందుకోలేకపోయింది. కేవలం ప్రభాస్ వింటేజ్ లుక్ ఫ్యాన్స్ ను విపరీతంగా ఆకట్టుకుంది. ఇక ఇప్పుడు సందీప్ రెడ్డి వంగ దర్శకత్వంలో సినిమా చేస్తున్నారు ప్రభాస్. స్పిరిట్ అనే పవర్ ఫుల్ టైటిల్ తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో ప్రభాస్ కు జోడీగా తృప్తి దిమ్రి నటిస్తుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదల చేసిన ప్రీ లుక్ పోస్టర్ తెగ వైరల్ అయ్యింది. ఈ సినిమా షూటింగ్ సైలెంట్ గా కానిచ్చేస్తున్నారు దర్శకుడు సందీప్ రెడ్డి వంగ. చేసిన మూడు సినిమాలతోనే ఇండస్ట్రీలో తోప్ దర్శకుడిగా మారిపోయాడు సందీప్. అర్జున్ రెడ్డి సినిమాతో దర్శకుడిగా తొలి విజయాన్ని అందుకున్నాడు. అదే సినిమాను హిందీలో కబీర్ సింగ్ టైటిల్ తో తెరకెక్కించి అక్కడ కూడా భారీ హిట్ అందుకున్నాడు. ఆ తర్వాత యానిమల్ సినిమాతో బాలీవుడ్ ను షేక్ చేశాడు. తెలుగు, హిందీ భాషల్లో విడుదలైన యానిమల్ సంచలన విజయాన్ని అందుకుంది. ఇక ఇప్పుడు స్పిరిట్ తో రానున్నాడు. సందీప్ రెడ్డి, ప్రభాస్ కాంబినేషన్ లో సినిమా ఎలా ఉంటుందా అని అభిమానులంతా వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉంటే తాజాగా స్పిరిట్ సినిమా నుంచి ప్రభాస్ లుక్ లీక్ అయ్యిందంటూ సోషల్ మీడియాలో కొన్ని ఫోటోలు వైరల్ అవుతున్నాయి. పంచకట్టులో ప్రభాస్ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. పంచెకట్టులో, చేతిలో గన్ పట్టుకుని స్టైలిష్‌గా ఉన్న ప్రభాస్ ఫోటో చూసి ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. ప్రభాస్ లుక్ లో నిజం లేదని తెలుస్తుంది. ఆ ఫోటో ఏఐ ద్వారా చేసిందని తెలుస్తుంది. ప్రభాస్ లుక్ లీక్ అనగానే ఫ్యాన్స్ చాలా మంది దాని పై ఆరా తీశారు. దాంతో అసలు విషయం బయట పడింది. ఈ ఫోటోలో ప్రభాస్ వెనక ఉన్న ఓ వ్యక్తి తల భాగం ముందుకి, మిగతాది వెనక్కి ఉండటంతో ఫ్యాన్స్ ఈజీగా కనిపెట్టేశారు. ఏఐ ఫోటో అయినప్పటికీ ప్రభాస్ ఫ్యాన్స్ మాత్రం పండగ చేసుకుంటున్నారు.. ఈ లుక్ గాని పడితే థియేటర్స్ తగలబడి పోవడం ఖాయం అంటున్నారు రెబల్ స్టార్ ఫ్యాన్స్..



# 'నాగిన్' బ్యూటీ విడాకులు..

### ప్రభాస్ హీరోయినే కారణమా?

బాలీవుడ్ టీవీ నటి మౌని రాయ్ తన భర్త సూరజ్ నంబియార్‌కు విడాకులు ఇచ్చింది. దీనికి ఒక స్టార్ హీరోయినే కారణమని చాలామంది ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం మౌనీ రాయ్ తో పాటు ఆ హీరోయిన్‌పై కూడా సామాజిక మాధ్యమాల్లో భారీగా ట్రోలింగ్ జరుగుతోంది. బాలీవుడ్ టెలివిజన్ నటి మౌని రాయ్ తన వైవాహిక జీవితానికి ముగింపు పలికారు. తాను వ్యాపారవేత్త సూరజ్ నంబియార్ నుంచి విడాకులు తీసుకుంటున్నట్లు ఆమె అధికారికంగా ప్రకటించారు . అయితే , దీని తర్వాత సోషల్ మీడియాలో ఆమెపై భారీగా ట్రోలింగ్ జరుగుతోంది. దీంతో మౌని రాయ్ తన ఇన్‌స్టాగ్రామ్ పోస్టుల కామెంట్ సెక్షన్‌ను ఆఫ్ చేశారు. దీనికి ప్రధాన కారణం, ఈ విడాకుల విషయంలో నెటిజన్లు మౌని రాయ్ సన్నిహితురాలైన నటి దిశా పటానీని ట్రోల్ చేయడమే. గత కొన్ని రోజులుగా, మౌని రాయ్, సూరజ్ నంబియార్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరినొకరు అన్‌ఫాలో చేసుకోవడంతో వారి మధ్య మనస్పర్థలు వచ్చాయన్న వదంతులు వ్యాపించాయి. దీనిపై స్పందిస్తూ, వారు విడిపోతున్నట్లు ధృవీకరిస్తూ ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. 'మా వ్యక్తిగత ప్రాధాన్యతలలో మార్పు కారణంగా, మేము పరస్పర గౌరవంతో విడిపోవాలని నిర్ణయించుకున్నాము. ఈ కష్ట సమయంలో దయచేసి మా గోప్యతను గౌరవించండి. ఎలాంటి తప్పుడు కథనాలను ప్రచారం చేయవద్దు' అని మౌని, సూరజ్ అభ్యర్థించారు. మౌని రాయ్ తన విడాకుల పోస్ట్‌ను షేర్ చేసిన వెంటనే, నెటిజన్లు కామెంట్ బాక్స్‌లో నటి దిశా పటానీని ట్రోల్ చేయడం ప్రారంభించారు. మౌని, దిశా చాలా మంచి స్నేహితులు. తరచుగా కలిసి పార్టీలకు, ట్రిప్పులకు వెళ్తుంటారు. ఎలాంటి ఆధారాలు లేకుండా, ఆ జంట విడిపోవడానికి దిశా పటానీయే కారణమని నెటిజన్లు ఆరోపించడం మొదలుపెట్టారు. మరికొందరైతే చాలా నీచమైన కామెంట్స్ చేస్తున్నారు. మౌని రాయ్, దిశా పటానీల స్నేహంపై అనుమానం వ్యక్తం చేస్తూ కామెంట్స్ పెడుతున్నారు. కాగా తన ఫ్రెండ్ దిశా పటానీపై జరుగుతోన్న ట్రోల్స్‌ను ఆపడానికి మౌని రాయ్ తన విడాకుల పోస్ట్‌పై కామెంట్లను వెంటనే నిలిపివేసింది. అయినప్పటికీ ఆగని నెటిజన్లు మౌని రాయ్ పాత ఇన్‌స్టాగ్రామ్ పోస్టుల వద్దకు వెళ్లి దిశాకు వ్యతిరేకంగా కామెంట్స్ చేయడం ప్రారంభించారు.

### బుమ్రా కెప్టెన్సీలో టీమ్ జోష్ మామూలుగా లేదుగా..

# హార్దిక్ లేకపోవడమే కలిసొచ్చిందా?



ముంబై ఇండియన్స్ కెప్టెన్సీపై మాజీ సెలెక్టర్ శ్రీకాంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హార్దిక్ లేకపోవడంతో బుమ్రా సారథ్యంలో జట్టు ఐక్యంగా, సంతోషంగా కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు. ఈ మార్పు ముంబై క్యాంప్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని కృష్ణమాచారి శ్రీకాంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ ఎట్టకేలకు ఫామ్‌లోకి వచ్చింది. ధర్మశాల వేదికగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో ముంబై అద్భుత విజయాన్ని అందుకుంది. ఈ మ్యాచ్‌లో తిలక్ వర్మ (75 నాటౌట్) వీరోచిత ఇన్నింగ్స్ ఆడి జట్టును గెలిపించాడు. అయితే ఈ విజయం కంటే కూడా టీమ్ బాడీ లాంగ్వేజ్, జస్ప్రీత్ బుమ్రా కెప్టెన్సీ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. రెగ్యులర్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా గాయం కారణంగా దూరం కావడంతో, బుమ్రా సారథ్య బాధ్యతలు చేపట్టాడు. ఈ మార్పు ముంబై క్యాంప్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని మాజీ సెలెక్టర్ కృష్ణమాచారి శ్రీకాంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

**హార్దిక్ పాండ్యాకు ఏమైంది?**

ముంబై కెప్టెన్ హార్దిక్ పాండ్యా వెన్నునొప్పి కారణంగా గత మూడు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ప్రస్తుతం అతను రిలయన్స్ కార్పొరేట్ పార్క్‌లో ప్రాక్టీస్ చేస్తున్నప్పటికీ, మెడికల్ టీమ్ నుంచి ఇంకా గ్రీన్ సిగ్నల్ రాలేదు. దీంతో అతను జట్టుతో కలిసి ధర్మశాల ప్రయాణం చేయలేదు. హార్దిక్ గైర్హాజరీలో, సూర్యకుమార్ యాదవ్ కూడా వ్యక్తిగత కారణాల వల్ల అందుబాటులో లేకపోవడంతో కెప్టెన్సీ బాధ్యతలు బుమ్రా భుజాన పడ్డాయి. అయితే బుమ్రా నేతృత్వంలో జట్టు ఆడిన తీరు అందరినీ ఆశ్చర్యపరిచింది.

**బుమ్రా కెప్టెన్సీపై చీఫ్ సెలెక్టర్ ప్రశంసలు**

టీమిండియా మాజీ కెప్టెన్, చీఫ్ సెలెక్టర్ శ్రీకాంత్ తన యూట్యూబ్ ఛానెల్‌లో ముంబై విజయంపై స్పందించారు. "బుమ్రాను కెప్టెన్ చేయడం మేనేజ్‌మెంట్ తీసుకున్న అత్యుత్తమ నిర్ణయం. మైదానంలో ఆటగాళ్లందరూ చాలా సంతోషంగా, ఐకమత్యంగా కనిపించారు. జట్టులో ఏదో సమస్య ఉందనేది స్పష్టంగా తెలుస్తోంది, కానీ బుమ్రా కెప్టెన్సీలో టీమ్ మూడ్ ఒక్కసారిగా మారిపోయింది. బుమ్రా నిరంతరం చిరునవ్వుతో బౌలర్లలో ఆత్మవిశ్వాసాన్ని నింపాడు" అని శ్రీకాంత్ విశ్లేషించారు. ధోనీ నాయకత్వాన్ని ఎంతగానో ఇష్టపడే శ్రీకాంత్.. ఇప్పుడు బుమ్రాలో కూడా అలాంటి శాంత స్వభావాన్ని చూస్తున్నానని చెప్పారు.

**సమిష్టి కృషితోనే విజయం**

ఈ మ్యాచ్‌లో కేవలం తిలక్ వర్మ మాత్రమే కాదు, బౌలింగ్‌లో శార్దూల్ ఠాకూర్ నాలుగు కీలక వికెట్లు తీసి పంజాబ్ నడ్డి విరిచాడు. దీపక్ చాహర్, రాజ్ అంగద్ బావా కూడా కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. ఓపెనర్ ర్యాన్ రికెల్టన్ అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చాడు. ముంబై జట్టు పీకల్లోతు కష్టాల్లో ఉన్నప్పటికీ, గెలవాలనే కసి ఆటగాళ్లలో స్పష్టంగా కనిపించింది. బుమ్రా బాడీ లాంగ్వేజ్ జట్టు మొత్తానికి పాజిటివ్ ఎనర్జీని ఇచ్చిందని, అందుకే ముంబై మళ్ళీ పుంజుకుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ముంబై తన తదుపరి మ్యాచ్‌ను మే 20న కోల్‌కతా నైట్ రైడర్స్‌తో ఆడనుంది.

### ప్లేఆఫ్స్ రేసులో 8 జట్లు..

# దిమ్మతిరిగే ట్విస్ట్‌కు సిద్ధమైన ఆ రెండు టీంలు..!



ఐపీఎల్ 2026 సీజన్ ముగింపు దశకు చేరుకోవడంతో ప్లేఆఫ్స్ పోరు అత్యంత ఉత్కంఠభరితంగా మారింది. పది జట్లలో ముంబై ఇండియన్స్, లక్నో సూపర్ జెయింట్స్ ఇప్పటికే రేసు నుంచి నిష్క్రమించగా, మిగిలిన 8 జట్లు టాప్-4 కోసం హోరాహోరీగా తలపడుతున్నాయి. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఉన్న సమీకరణాలు, జట్ల అర్హత అవకాశాలను ఓసారి చూద్దాం.. ప్రస్తుతం 16 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్న డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ప్లేఆఫ్స్ చేరడానికి అడుగు దూరంలో ఉంది. మిగిలి ఉన్న రెండు మ్యాచ్‌లలో విజయం సాధిస్తే 20 పాయింట్లతో అగ్రస్థానాన్ని సుస్థిరం చేసుకోవడమే కాకుండా, క్వాలిఫైయర్-1 ఆడే అవకాశం పొందుతుంది. ఒకవేళ ఒక మ్యాచ్ ఓడిపోయినా, మెరుగైన నెట్ రన్ రేట్ (o1.053)తో టాప్-2లో నిలబెట్టే అవకాశం ఉంది.

**గుజరాత్ టైటాన్స్ ఆధిపత్యం..**

వరుసగా ఐదు విజయాలతో జోరు మీదున్న గుజరాత్ టైటాన్స్ కూడా 16 పాయింట్లతో పటిష్ట స్థితిలో ఉంది. వీరు తమ తదుపరి రెండు మ్యాచ్‌లలో గెలిస్తే నేరుగా అగ్రస్థానానికి చేరుకుంటారు. అయితే, ఒకవేళ రెండింటిలోనూ ఓడిపోతే మాత్రం ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సి వస్తుంది.

**సన్‌రైజర్స్ హైదరాబాద్, పంజాబ్ కింగ్స్ పరిస్థితి..**

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఖాతాలో 14 పాయింట్లు ఉన్నాయి. ప్లేఆఫ్స్ బెర్త్ ఖాయం చేసుకోవాలంటే మిగిలిన రెండు మ్యాచ్‌లలో తప్పక గెలవాలి. మరోవైపు పంజాబ్ కింగ్స్ వరుసగా ఐదు ఓటములతో ఇబ్బందుల్లో పడింది. 13 పాయింట్లతో ఉన్న పంజాబ్, తమ మిగిలిన మ్యాచ్‌లు గెలిచినా గరిష్టంగా 17 పాయింట్లకే చేరుకుంటుంది. దీంతో ఇతర జట్ల ఓటములపైనే పంజాబ్ ఆశలు నిలిచాయి.

**చెన్నై, రాజస్థాన్ జట్ల పోరాటం..**

చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ చెరో 12 పాయింట్లతో రేసులో ఉన్నాయి. చెన్నై తమ మిగిలిన మూడు మ్యాచ్‌లలో గెలిచి 18 పాయింట్లకు చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. రాజస్థాన్ రాయల్స్ కూడా తమ అన్ని మ్యాచ్‌లు గెలవడంతో పాటు అగ్రస్థానంలో ఉన్న జట్లు పాయింట్లు కోల్పోవాలని కోరుకుంటున్నాయి.

**ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్..**

ఢిల్లీ క్యాపిటల్స్ (10 పాయింట్లు), కోల్‌కతా నైట్ రైడర్స్ (9 పాయింట్లు) ఆశలు తక్కువగా ఉన్నప్పటికీ సాంకేతికంగా ఇంకా రేసులోనే ఉన్నాయి. ఢిల్లీ తమ మిగిలిన మ్యాచ్‌లలో భారీ తేడాతో గెలవడమే కాకుండా, పంజాబ్, చెన్నై జట్లు తమ అన్ని మ్యాచ్‌లలో ఓడిపోవాలని ప్రార్థించాలి. కోల్‌కతా పరిస్థితి కూడా దాదాపు ఇలాగే ఉంది; వారు ప్రతి మ్యాచ్ గెలిచి అద్భుతం జరుగుతుందని ఆశిస్తున్నారు.


విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...





VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com